నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 8-5-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 227 | పేజీలు:4 | వెల: రూ.1/-

జమ్మూలో ఉగ్రవాదుల ఏరివేత.. నాలుగు నెలల్లో 64 మందిని మట్టుబెట్టిన సైన్యం

శ్రీనగర్, మే 7:జమ్మూకశ్మీర్‌లో ముష్కరులను సైన్యం ఏరి వేస్తున్నది. స్పష్టమైన నిఘా, సమాచారంతో ఆర్మీ, సీఆర్ఎపీఎఫ్, స్థానిక పోలీసుల సంయుక్త బృందం ఉగ్రవాదులను మట్టుబెడుతున్నది. ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లో భద్రతా బలగాలు 64 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. ఏప్రిల్ నెలలో రికార్డు స్థాయిలో 14 ఎన్‌కౌంటర్లు జరగ్గా.. ఇందులో 23 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. ఆయా ఘటనల్లో ఇద్దరు జవాన్లు వీరమరణం పొందారు.

హతమైన 39 మంది ఉగ్రవాదులకు పాక్ ఐఎస్ఐ మద్దతున్న లష్కరే తోయిబా సంస్థతో సంబంధం ఉన్నది.భద్రతా బలగాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్‌లో జరిగిన 14 ఎన్‌కౌంటర్లు జరిగాయి. ప్రధాని నరేంద్ర మోదీ జమ్మూ కాశ్మీర్ పర్యటనకు ముందు జమ్మూ ప్రాంతంలో భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకున్నది. జనవరి నుంచి ఏప్రిల్ వరకు కాశ్మీర్ డివిజన్‌లో 62 మంది ఉగ్రవాదులు, జమ్మూలో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. హతమైన 64 మంది ఉగ్రవాదుల్లో 17 మంది ఉగ్రవాదులు స్థానికేతరులు. మిగిలిన 47 మంది ఉగ్రవాదులు స్థానికులు. ఇందులో 39 మంది 'లష్కరే తోయిబా' ఉగ్రవాదులు, 17 మంది జైషే మహ్మద్ ఉగ్రవాదులు, ఆరుగురు హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాదులు, ఇద్దరు అల్ బదర్ గ్రూప్ ఉగ్రవాదులు ఉన్నారు.

రాహుల్ డిక్లరేషన్‌లో కొత్తదనం ఏం లేదు : వినోద్ కుమార్

హైదరాబాద్, మే 7: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలోనే డిక్లేర్ చేసి ఇప్పటికే విజయవంతంగా అమలు చేస్తున్న వ్యవసాయ విధానాన్ని రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్ పేరిట ప్రకటించారని, ఇందులో కొత్త దనం ఏమీ లేదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఎలాంటి ప్రిపరేషన్ లేకుండా రాష్ట్ర పర్యటనకు వచ్చిన రాహుల్ గాంధీకి రాష్ట్రం పట్ల, రైతుల పట్ల ఉన్న వైఖరి ఏమిటో వరంగల్ సభ ద్వారా తేటతెల్లం అయిందన్నారు.

తెలంగాణ వ్యవసాయ విధానం యావత్ దేశానికి ఆదర్శం..

సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న వ్యవసాయ విధానం యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, ఇదే విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన ఉన్న నీతి ఆయోగ్ పలుమార్లు ప్రశంశలు కురిపించిందని వినోద్ కుమార్ గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న వ్యవసాయ విధానాన్ని రాహుల్ గాంధీ అనుసరించారని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ సహా దేశవ్యాప్త పార్టీల నాయకులు కేసీఆర్ వ్యవసాయ విధాన మార్గాన్ని అనుసరించక తప్పని పరిస్థితి నెలకొందని వినోద్ కుమార్ స్పష్టం చేశారు.

టీఆర్ఎస్ పథకాలనే ప్రకటించారు..

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలనే రాహుల్ గాంధీ వరంగల్ సభలో ప్రకటించారని వినోద్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు ఇప్పటికే అమలు చేస్తోందని, ఇదే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్ లో ప్రకటించిందని గుర్తు చేశారు. రైతుల పాలిట ప్రాణ సంకటంగా మారిన నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందుల విక్రయదారుల ఆట పట్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పీడీ యాక్ట్ ను ఇప్పటికీ అమలు చేస్తోందని, ఇదే విషయాన్ని కాంగ్రెస్ తన డిక్లరేషన్లో చెప్పిందని ఆయన తెలిపారు.

పట్వారి వ్యవస్థ తీసుకొచ్చేందుకు కుట్ర

రాష్ట్రంలో పుష్కలంగా సాగునీరు సౌకర్యం కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని వినోద్ కుమార్ తెలిపారు. కాళేశ్వరం, పాలమూరు ? రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందిస్తున్నామని, కానీ కాంగ్రెస్ డిక్లరేషన్‌లో కొత్తదనం ఏమీ లేదని వినోద్ కుమార్ పేర్కొన్నారు. ధరణి పోర్టల్ ద్వారా రెవెన్యూ రికార్డులన్నింటిని, భూముల వివరాలన్నీ పక్కాగా పొందుపరుస్తున్నామని తెలిపారు. కానీ కాంగ్రెస్ వరంగల్ డిక్లరేషన్ ద్వారా మళ్లీ పట్వారి వ్యవస్థను తీసుకువచ్చేందుకు కుట్ర పన్నుతున్నట్లుగా స్పష్టమవుతోందని వినోద్ కుమార్ అన్నారు.

ఆ పరిశ్రమలు మూతపడటానికి కాంగ్రెస్సే కారణం..

రాష్ట్రంలో చక్కెర కర్మాగారాలు సహా అనేక పరిశ్రమలు మూత పడటానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే ప్రధాన కారణమని వినోద్ కుమార్ ఆరోపించారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని మూతపడిన పరిశ్రమలను తెరిపిస్తామని అంటున్నారని నిలదీశారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, కోవిడ్ కష్టకాలంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్దకు వెళ్లి ప్రతి కొనుగోలు చేసిందని వినోద్ కుమార్ గుర్తు చేశారు. రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నదని ఆయన తెలిపారు. రైతులను, ప్రజలను మోసం చేసే మాటలు కట్టిపెట్టాలని వినోద్ కుమార్ కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీకి సూచించారు.

పంజాబ్ రైతాంగం మిమ్మల్ని ఈడ్చి తన్నింది.. రాహుల్ గాంధీపై మంత్రి హరీశ్ రావు ఫైర్

హైదరాబాద్, మే 7:కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్‌ను పంజాబ్ రైతులే నమ్మలేదని, చైతన్యవంతులైన తెలంగాణ రైతులు ఎలా నమ్ముతారని ఆ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీని మంత్రి హరీశ్ ప్రశ్నించారు. అది రైతు సంఘరణ సభ కాదని, రాహుల్ సంఘర్షణ సభ అని తెలంగాణ ప్రజానికం భావిస్తున్నదని చెప్పారు. వ్యవసాయ ప్రాధాన్య రాష్ట్రమైన పంజాబ్ రైతాంగమే మిమ్మల్ని ఈడ్చి తన్నిందని ట్విటర్ వేదికగా రాహుల్ గాంధీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సబ్బండ వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పనిచేసే ఏకైక పార్టీ టీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు.

'రాహుల్ గాంధీ గారూ, వ్యవసాయ ప్రాధాన్య రాష్ట్రమైన పంజాబ్ రైతాంగమే మిమ్మల్ని ఈడ్చి తన్నింది.

పంజాబ్ రైతులు నమ్మని మీ రైతు డిక్లరేషన్ ? చైతన్యవంతులైన తెలంగాణ రైతులు నమ్ముతారా? ఇది రాహుల్ సంఘర్షణ సభ ? రైతు సంఘర్షణ సభ కాదని తెలంగాణ ప్రజానీకం భావిస్తున్నారు.

ఎయిర్ పోర్టులో దిగి ఇవ్వాల ఏం మాట్లాడాలి, సభ దేని గురించి అని అడిగిన రాహుల్ గాంధీకి తెలంగాణ రైతుల గురించి ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతుంది. ఎప్పటికీ తెలంగాణలోని సబ్బండ వర్గాల సంక్షేమం గురించి నిరంతరం పనిచేసే ఏకైక పార్టీ సీఎం కేసీఆర్ నాయకత్వంలోని టీఆర్ఎస్ మాత్రమే.' అని మంత్రి హరీవ్ రావు ట్వీట్ చేశారు.

ప్రాజెక్టులకు భూములిచ్చిన రైతులందరికీ పాదాభివందనాలు : మంత్రి కేటీఆర్

వరంగల్, మే 7: రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న ప్రాజెక్టులకు భూములిచ్చిన రైతులందరికీ పాదాభివందనాలు చేస్తున్నానని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. గీసుకొండ మండలం హవేలీలోని కాకతీయ మెగా టైక్స్‌టైల్ పార్కులో ఏర్పాటు చేస్తున్న కిటెక్స్ టెక్స్‌టైల్ పరిశ్రమకు భూమిపూజ చేసిన సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు.

కిటెక్స్ టెక్స్ టైల్స్ పరిశ్రమతో పరకాల నియోజకవర్గం లోని వేలాది మందికి ఉపాధి అవకాశాలు రాబోతున్నాయని తెలిపారు. రైతులు కష్టమైనా, నష్టమైనా ఓర్చుకొని ఇబ్బందైనా తట్టుకొని భూములు ఇచ్చిన వారందరికీ పేరుపేరునా పాదాభివందనాలు చేస్తున్నాను. ఎందుకంటే చిన్న త్యాగం కాదు. ప్రాజెక్టులకు భూములు ఇచ్చే రైతుల త్యాగాలు వెలకట్టలేనివి. వాళ్లకు మనం ఎంత చేసినా తక్కువనే. రుణం తీరదు. కొంత మంది నష్టపోతే చాలా మందికి లాభం జరుగుతుందని ఆలోచన చేసి, పెద్ద మనసుతో భూములు ఇస్తున్నారు. భూములు ఇచ్చిన రైతులందరికీ 100 గజాల చొప్పున ప్లాట్లు ఇవ్వాలని చెప్పారు. కచ్చితంగా ఇస్తామని మాటిస్తు న్నానని కేటీఆర్ స్పష్టం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పారిశ్రామికీకరణ వేగంగా జరగాలన్నారు.

ప్రపంచంలోనే రెండో అతిపెద్ద సంస్థ పిల్లల దుస్తులు తయారు చేసే సంస్థ కిటెక్స్ అని చెప్పారు. ఈ పరిశ్రమ నుంచి ఉత్పత్తి చేసిన బట్టలను దేశవిదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. కిటెక్స్ సంస్థ రూ. 3 వేల కోట్లు పెట్టుబడులు పెట్టాలని ఆలోచన చేసినప్పుడు వారిని తెలంగాణకు ఆకర్షించడానికి ఎంతో ప్రయత్నం చేసి తీసుకొచ్చాం. మీరు ఇక్కడ పెడితేనే వరంగల్ బిడ్డలకు న్యాయం జరుగుతుందని చెప్పి కిటెక్స్ సంస్థను ఏర్పాటు చేస్తున్నాం. రూ. 1600 కోట్ల పెట్టుబడులు పెట్టబోతోంది. 15 వేల మందికి ఉద్యోగాలు రాబోతున్నాయని తెలిపారు. కొరియాకు చెందిన యంగ్ వన్ అనే కంపెనీ రూ. 1100 కోట్లతో పెట్టుబడులు పెట్టబోతున్నారు. 12 వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. ఈ రెండు కంపెనీలు కూడా 8 నుంచి 11 ఫ్యాక్టరీలు పెట్టబోతున్నారు. రాబోయే 18 నెలల్లో పనులన్నీ పూర్తవుతాయి. భారతదేశంలో ఇలాంటి టెక్స్ టైల్స్ పార్కు ఎక్కడా లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

వడ్లు తెల్వదు.. ఎడ్లు తెల్వదు.. రాహుల్‌పై కేటీఆర్ సెటైర్లు..

వరంగల్, మే 7: కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వ్యవసాయం అంటే ఏంటో తెలియని రాహుల్ గాంధీకి ఏదో పేపర్ రాసిస్తే అది చదివి వెళ్లిపోయిండని కేటీఆర్ సెటైర్లు వేశారు. గీసుకొండ మండలం హవేలీలోని కాకతీయ మెగా టైక్స్‌టైల్ పార్కులో ఏర్పాటు చేస్తున్న కిటెక్స్ టెక్స్‌టైల్ పరిశ్రమకు భూమిపూజ చేసిన సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు.

కేసీఆర్ ఆలోచన ఒక్కటే.. మన పిల్లలు బాగుండాలి, భవిష్యత్ తరం బాగుండాలి.. వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలి. మన రైతులు బాగుండాలి. మన మహిళలు బాగుండాలనేదే కేసీఆర్ తపన అని కేటీఆర్ తెలిపారు. ప్రగతి పథంలో దూసుకెళ్తున్న రాష్ట్రాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లాలని కేసీఆర్ తాపత్రాయపడుతున్నారని పేర్కొన్నారు. మనం మంచి పనులు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం.

మన పిల్లలకు ఉద్యోగాల కోసం.. టెక్స్ టైల్ పార్కు, ఫార్మాస్యూటికల్ పార్క్, మెడికల్ డివైజెస్ పార్కు, ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన లైఫ్ సైన్సెస్ జీనోమ్ క్లస్టర్ ను ఏర్పాటు చేసుకుంటున్నామని కేటీఆర్ తెలిపారు.

కానీ ప్రతిపక్షాలు, పొలిటికల్ టూరిస్టులు వస్తరు పోతరు. రోజుకు ఒకరు వస్తున్నరు.

నిన్న గాక మొన్న ఒకాయన మహబూబ్‌నగర్‌కు వచ్చిండు. నిన్న ఒకాయన వరంగల్‌కు వచ్చిండు.. వాళ్లేదో రాసిస్తే ఆయన చదివి పోయిండు.

ఆయనకు ఏం తెల్వదు పాపం.. వడ్లు తెల్వదు.. ఎడ్లు తెల్వదు. ఏదో డైలాగ్ కొట్టాలి.. నాలుగు మాట్లాడాలి.. అవతల పడాలి అనేది వారి ప్రణాళిక అని కేటీఆర్ పంచులు వేశారు.

కాంగ్రెస్ డిక్లరేషన్ ఆచరణ సాధ్యమేనా?: తలసాని మంత్రి తలసాని

హైదరాబాద్, మే 7:నిన్న హనుమకొండలో నిర్వహించిన కాంగ్రెస్ సభను ఉద్దేశించి.. అది రైతు సంఘర్షణ సభ కాదు.. కాంగ్రెస్ నేతల అంతర్గత సంఘర్షణ సభ అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. టీఆర్ఎస్ఎల్పీలో ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, దానం నాగేందర్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ ప్రభాకర్‌తో కలిసి తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియాతో మాట్లాడారు.

వరంగల్ సభలో ప్రకటించిన డిక్లరేషన్ ఆచరణ సాధ్యం కానిదని మంత్రి స్పష్టం చేశారు. ఆ డిక్లరేషన్ రాష్ట్రానికి సంబంధించిందా? దేశానికి సంబంధించిందా? అనే విషయంలో స్పష్టత లేదన్నారు.

రాష్ట్ర బడ్జెట్ ఎంత.. హామీల అమలుకు అయ్యే ఖర్చు ఎంత? అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే వ్యవసాయం లాభసాటిగా మారిందని స్పష్టం చేశారు. 60 సంవత్సరాలు అధికారంలో ఉన్న మీరు రైతులకు ఏం చేశారో చెప్పగలరా? అని నిలదీశారు. నిజంగా రైతులపై ప్రేమ ఉంటే ఢిల్లీలో రైతులకు మద్దతుగా ధర్నా చేస్తే ఎక్కడికి పోయారని అడిగారు.

కేసీఆర్ పోరాటానికి తలొగ్గి రాష్ట్రం ఇచ్చారు..

పదే పదే తెలంగాణ రాష్ట్రం ఇచ్చామని కాంగ్రెస్ నేతలు చెప్పడం సరికాదని మంత్రి తలసాని అన్నారు. కేసీఆర్‌తో పాటు తెలంగాణ ప్రజలు చేసిన పోరాటానికి తలొగ్గి తెలంగాణ రాష్ట్రం ఇచ్చారనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. రాహుల్ గాంధీ ఓ పార్ట్‌టైం పొలిటిషీయన్ అని విమర్శించారు. ఢిల్లీ నాయకులు రాష్ట్రానికి టూరిస్టులుగా వచ్చి వెళ్తున్నారు.. వారితో తెలంగాణ ప్రజలకు ఒరిగేదేమీ లేదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తేల్చిచెప్పారు.

రాజకీయ లబ్ధి కోసం యాదాద్రిపై విమర్శలు సరికాదు:మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

హైదరాబాద్, మే 7:ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహా స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యాల కల్పన, ప్రస్తుతం కొనసాగుతున్న పనులపై శనివారం దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.

అరణ్య భవన్ లో నిర్వహించిన ఈ సమావేశానికి దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్ రావు, ఆర్ ఉ బీ ఈఎన్సీ గణపతి రెడ్డి, ఎస్ఈ వసంత్ కుమార్, ఆలయ ఇంచార్జీ ఈవో రామకృష్ణ, ఇతర అధికారులు హాజరయ్యారు. క్యూ కాంప్లెక్స్ లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడటం, వాష్ రూమ్స్ లో పరిశుభ్రత, కొండ పైన చలువ పందిళ్ళు ఏర్పాటు, మురుగునీటి కాల్వల నిర్వహణ, క్యూ కాంప్లెక్స్ లో ఫ్యాన్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడటం, వృద్ధులు, వికలాంగులకు వీల్ చైర్ లు అందుబాటులో ఉండేలా చూడటం, కొండ కింద మొబైల్ టాయ్లెట్స్ ఏర్పాటు, ఇతర వసతులు ఏర్పాటు పై సమావేశంలో చర్చించారు.

అకాల వర్షం వల్ల ఉత్పన్నమైన సమస్యలు, పునరుద్ధరణ చర్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. కూలిన పందిళ్లు, వాననీటి లీకేజీలు, ఇతర నష్టాలపై ఆరా తీశారు. ఇలాంటి సమస్యలు భవిష్యత్ లో పునరావృతం కాకుండా వర్షకాలంలోగా వాటిని అధిగ మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

మౌలిక వసతులపై ప్రధానంగా దృష్టి పెట్టాలని, సామన్య భక్తులకు శీఘ్రదర్శనం జరిగేలా చూడాలన్నారు. ప్రధాన ఆలయంతో పాటు మిగితా నిర్మాణాలు నూతనంగా చేపట్టి నందు వల్ల కొన్ని రోజుల పాటు నిర్వహణలో పురోగతి చూపిస్తూ మందుకు వెళ్ళాల్సి ఉంటుందని, దీన్ని పెద్ద తప్పిదంగానో లేదా పొరపాట్లుగా చూడాల్సిన లేదని అభిప్రాయపడ్డారు. సర్దుబాటు సమయంగా దీన్ని భావించి, అన్ని అడ్డంకులను అధిగమించి అద్భుతమైన వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు.

భక్తులు క్యూ లైన్లలో ఎక్కువ సమయం వేచి ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.క్యూ లైన్లు, ఆలయ ప్రాంగణంలో వేచి ఉన్న అన్ని సమయాలలో భక్తులకు మంచినీరు అందించాలని, అదేవిధంగా భక్తులు ఎండవేడిమి నుంచి సేద తీరేవిధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

వసతి కల్పనలో ఆలస్యం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... యాదాద్రిని ప్రపంచ స్థాయి పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దడానికి సీఎం కేసీఆర్ యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం చేశారన్నారు. స్వయంభు దర్శనాల ప్రారంభం తర్వాత అక్కడ చిన్న చిన్న సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, ఒక్కొక్కటిగా వాటిని పరిష్కరిస్తూ సమస్యలను అధిగమిస్తున్నామని తెలిపారు. యాదాద్రికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుంగా ఆహ్లాదకర, ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించకుని వేళ్లేలా ఎల్లవేళల కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.



తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను ఎప్పుడో శిక్షించారు: మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, మే 7: పంజాబ్‌లో ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చని కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో కొత్త డ్రామాలు ఆడుతున్నదని మంత్రి నిరంజన్ రెడ్డి విమర్శించారు. తెలంగాణలోనే డిక్లరేషన్ చేస్తరా.. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో డిక్లరేషన్ చేయరా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు బాల్క సుమన్, ఆల వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి మంత్రి నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. 75 ఏండ్ల కాలంలో రైతుబీమా గురించి ఏనాడైనా ఆలోచించారా అని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధుతో రైతుల ఖాతాల్లో రూ.50 వేల కోట్లు జమ చేసిందన్నారు. 2017లో పంజాబ్ రైతులకు ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చలేదని, అందుకే అక్కడి ప్రజలు కాంగ్రెస్‌ను ఈడ్చి తన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీకి అసలు యంత్రంగమే లేకుండా పోయిందని చెప్పారు. కాంగ్రెస్‌ను తెలంగాణ ప్రజలు ఎప్పుడో శిక్షించారని చెప్పారు. 2014లో ఎన్నికల్లో రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ చెప్పినప్పటికీ.. రూ.లక్ష మాఫీ చేస్తామన్న టీఆర్ఎస్‌నే తెలంగాణ ప్రజలు నమ్మారని వెల్లడించారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ పథకాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు.

అసలు ఎందుకు వచ్చారో రాహుల్‌కే తెలియదని, ఇవాళ ఏం మాట్లాడాలని అడగడంతోనే ఆయన చిత్తశుద్ధి తెలుస్తున్నదని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఎవరో భిక్షమిచ్చింది కాదని, వేలాది మంది బలిదానం, పోరాటాల ద్వారా రాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలిపారు. ఇప్పుడిప్పుడే తెలంగాణ పచ్చబడుతున్నదని వెల్లడించారు. నిన్న, మొన్న కాంగ్రెస్‌ను బూతులు తిట్టినోడే నేడు ఆ పార్టీకి సారథి అని మంత్రి విమర్శించారు. ప్రతి ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరిస్తున్నారని ఎద్దేవా చేశారు.

దేశంలో అరాచక పాలనకు కాంగ్రెస్ దోహదపడిందని విమర్శించారు. ప్రతిపక్షంగా పోషించాల్సిన పాత్ర కాంగ్రెస్ పోషించడం లేదని చెప్పారు. దేశంలో 15 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే ఏనాడైనా కాంగ్రెస్ పోరాడిందా అని ప్రశ్నించారు. స్వాతంత్ర ఉద్యమంలో కాంగ్రెస్ పాత్ర ఉందని.. కానీ కాంగ్రెస్‌దే ప్రధాన పాత్రలేదని, ఆ పార్టీ పుట్టకముందే స్వాతంత్ర ఉద్యమం నడిచిందని మంత్రి అన్నారు.

బీజేపీకి వత్తాసుగా మాట్లాడితే ఊరుకోను మంత్రి కేటీఆర్

హైదరాబాద్, మే 7: కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపై టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. బీజేపీకి వత్తాసుగా మాట్లాడితే ఊరుకోను అని రాహుల్ గాంధీ నిన్నటి వరంగల్ సభలో మాట్లాడిండు అని కేటీఆర్ గుర్తు చేస్తూ.. గాంధీ భవన్‌ను గాడ్సేకు అప్పజెప్పావని తీవ్ర విమర్శలు చేశారు. ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని నరనరాన నింపుకున్న వ్యక్తికి అప్పజెప్పావు. నీవు ఏం తెల్వనోనివి. రాసిస్తే చదివి పోయే వ్యక్తివి. అభం శుభం తెలియని అమాయకుడివి అజ్ఞానివి.. అంతకే ఉంటే మంచిదని రాహుల్‌ను కేటీఆర్ హెచ్చరించారు.

తొత్తులుగా ఉండే అవసరం మాకు లేదు..

టీఆర్ఎస్ పార్టీకి బీజేపీతోని సంబంధం ఉందని రాహుల్ చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. మాకు ఇతర పార్టీలకు బీ టీమ్, సీ టీమ్ అయ్యే దౌర్భాగ్యం పట్టలేదు. మేం తెలంగాణ ప్రజల కోసం కొట్లాడే టీమ్. తొత్తులుగా ఉండే అవసరం మాకు లేదు. కాంగ్రెస్ పార్టీ పేరే స్కాంగ్రెస్.

ఎ టు జడ్ అన్ని కుంభకోణాలే. ఆకాశంలో ఎగిరే అగస్టా హెలికాప్టర్, స్పెక్ట్రమ్ నుంచి మొదలుకుంటే.. పాతాళంలో దొరికే బొగ్గు వరకు అన్ని కుంభకోణాలే అని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

ఓటుకు నోటు దొంగను పక్కను కూర్చొబెట్టుకొని రాహుల్ అవినీతి గురించి మాట్లాడితే సిగ్గు పోతుందని కేటీఆర్ అన్నారు. ఇదే సీఎం రాజు అయితే.. నీ పీసీసీ అధ్యక్షుడు మాట్లాడే చిల్లర మాటలకు బయటే తిరిగేవాడా? యువరాజు అని నిన్ను పిలుస్తారు. నీ ముత్తాత మోతీ లాల్ నెహ్రూ నుంచి మొదలుపెడితే జవహర్ లాలా నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ, తర్వాత నువ్వు.. రాజరికం మాదిరిగా ఉన్నారు. మీరు ఇక్కడికి వచ్చి రాజులు అని మాట్లాడటం సరికాదన్నారు. ఒక వేళ కేసీఆర్ నియంత అయితే.. పొద్దునే లేస్తే తిట్టుడు ప్రోగ్రామ్ పెట్టుకునే వారు ఇక్కడే ఉండేవారా? ఈ ఆటలు సాగుతాయా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను క్షమించం అని అంటడు. టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోం అని అంటుండు. ఈ దేశంలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునే వారు లేరు. అమేథిలోనే గెలవలేవు. నువ్వు తెలంగాణకు వచ్చి పీకి పందిరి వేస్తావా? అని రాహుల్‌ను కేటీఆర్ దుయ్యబట్టారు.

దక్షిణ అండమాన్‌లో అల్పపీడనం.. తుఫానుగా మారే అవకాశం

హైదరాబాద్, మే 7:దక్షిణ అండమాన్ లో కొనసాగుతున్న అల్పపీడనం బలపడింది. ఆదివారం ఉదయం నాటికి తుఫానుగా మారుతుందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. వచ్చే 6 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో తీవ్రవాయుగుండంగా అల్పపీడనం మారనుంది. ఇది మరింత బలపడి వాయువ్య దిశగా పయనించే అవకాశం ఉందని వాతావరణ శాఖ బులెటిన్‌లో పేర్కొంది. ఈ నెల 10 నాటికి ఆంధ్రప్రదేశ్, ఒడిశా తీరానికి చేరుతుందని తెలిపింది. ఈ నెల 10 లేదా 11న విశాఖపట్టణం, భువనేశ్వర్ మధ్య నేలను తాకుతుందని పేర్కొంది. ఊహించినదానికన్నా అల్పపీడనం వేగంగా కదులుతోందని వెల్లడించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఫలితంగా ఒడిశా తీరప్రాంతంలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఎఐఆ) హెచ్చరించింది.

అల్పపీడనం నేడు తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, మే 8న తుపానుగా మారే అవకాశం ఉందని ఎఐఆ అంచనా వేసింది. ఆ తర్వాత తుఫాను వాయువ్య దిశగా పయనించి మే 10న ఆంధ్రప్రదేశ్, ఒడిశాకు చేరుకునే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

రాహుల్ గాంధీ మాటలను రైతులు నమ్మరు : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, మే 7:రాహుల్ గాంధీ బోగస్ మాటలను రైతులు నమ్మే స్థితిలోలేరని తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. కాంగ్రెస్ సభలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై శనివారం మంత్రి ఎర్రబెల్లి హన్మకొండలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రుణ మాఫీ చేశారా..? మీరు అధికారం వున్నప్పుడు రైతు బంధు, రైతు బీమా ఎందుకు ఇవ్వలేదు..? అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఉపాధిహామీ పతాకాన్ని వ్యవసాయానికి ఎందుకు అనుసంధానం చేయలేదని అడిగారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకే రైతులకు అనేక పథకాలు అమలు జరుగుతున్నాయని అన్నారు. పంటలకు గిట్టుబాటు

అవసరార్థులకు ఆపన్నహస్తం రెడ్ క్రాస్ సొసైటీ

(08 మే 'ప్రపంచ రెడ్ క్రాస్ దినం' సందర్భంగా)

నోబెల్ శాంతి పురస్కార గ్రహీత హెన్రీ డ్యునాంట్ 'ఇంటర్నేషనల్ కమిటీ ఆఫ్ రెడ్ క్రాస్' సంస్థను ప్రారంభించారు. హెన్రీ డ్యునాంట్ 08 మే 1828 రోజున జన్మించిన కారణంగా వారి సేవలకు గుర్తుగా ప్రతి ఏటా ప్రపంచవ్యాప్తంగా 08 మే రోజున 'ప్రపంచ రెడ్ క్రాస్, రెడ్ క్రిసెంట్ దినం' నిర్వహించుట ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ రెడ్ క్రాస్, రెడ్ క్రిసెంట్ ఉద్యమ సూత్రాలను ప్రపంచ మానవాళికి వివరించే ప్రయత్నాలలో భాగంగా 'వరల్డ్ రెడ్ క్రాస్ డే' పాటించుట జరుగుచున్నది. 1863లో జెనీవా సమావేశంలో రెడ్ క్రాస్ కమిటీ ఆఫ్ ఇంటర్నేషనల్ స్థాపించుటలో హెన్రీ డ్యునాంట్ పాత్ర ప్రధానమైనది. మె?దటి ప్రపంచ యుద్ధం మిగిల్చిన మారణహోమం, క్షతగాత్రుల హాహాకారాలకు చలించిన రెడ్ క్రాస్ సంస్థ శాంతి స్థాపన మరియు అవసరార్థులకు అమూల్య ఉచిత సేవలను అందించి, ప్రపంచ దృష్టిని ఆకర్షించడం జరిగింది.

8 మే 1948న ప్రారంభమైన 'ప్రపంచ రెడ్ క్రాస్ దినం' వేడుకలను ప్రతి ఏటా ఘనంగా జరుపుకోవడం, రెడ్ క్రాస్ ఉద్యమ లక్ష్యాలను అవగాహన చేసుకోవడం, పౌరసమాజం సంఘీభావం తెలుపడం జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా మానవ వేదనలను చెరుపుతూ, ప్రాణాపాయాలను తగ్గిస్తూ, మానవ హక్కుల స్థాపన మరియు వ్యక్తి గౌరవాన్ని కాపాడటం లాంటి ఆదర్శ సేవలను రెడ్ క్రాస్ సంస్థలు స్వచ్ఛందంగా తీసుకుంటాయి. ప్రకృతి విపత్తులైన భూకంపాలు, వరదలు, తుఫానులు లాంటివి జరిగిన సందర్భాలలో ప్రాణ, ఆస్తి నష్టాలను కాపాడడం అనాదిగా జరుగుచున్నది. స్వేచ్ఛ-స్వాతంత్ర్యత, మానవీయత, నిష్పాక్షికత, తటస్థత, విశ్వవ్యాప్తత, ఏకత మరియు స్వచ్ఛందత అనే సూత్రాల పునాదులపై రెడ్ క్రాస్ సేవలు విస్తరించబడ్డాయి. నేటి ప్రపంచవ్యాప్తంగా ఆకలి చావులు, హక్కుల ఉల్లంఘనలు, అణచివేతలు, సాయుధ పోరాటాలు, మారణహోమాలు, అంటువ్యాధులు, ప్రాంతీయ పోరాటాలు, కరువుకాటకాలు, ప్రకృతి ప్రళయాలు లాంటి అవాంఛనీయ ఘటనలు జరుగుతూనే ఉన్నాయని, ఆయా సందర్భాలలో ప్రపంచ నలుమూలల విస్తరించబడిన రెడ్ క్రాస్ సంస్థలు అద్వితీయ సేవలు అందిస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా 170 దేశాల్లో విస్తరించబడిన రెడ్ క్రాస్ సంస్థలో 95 మిలియన్ల స్వచ్ఛంధ కార్యకర్తలు అవసరార్థులకు అవిశ్రాంత సేవలు అందించగా 240 మిలియన్ల అభాగ్యులు లబ్ది పొందడం జరిగింది. ప్రపంచ రెడ్ క్రాస్ దినం సందర్భంగా పౌరసమాజం జనానికి అవసరమైన సేవలను ఉచితంగా అందించాలి. రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, అవగాహనలు, అన్నదానాలు, అనాథాశ్రమాలకు చేయూత, సామాజిక చైతన్యం, అవయవదాన ప్రతిజ్ఞలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు లాంటివి స్వచ్ఛందంగా చేపట్ట వచ్చు. విద్యాలయాల్లో బాలలు, యువతకు నిస్వార్థసేవల పట్ల రుచిని పరిచయం చేయాలి.

ప్రథమ ప్రపంచ యుద్ధంలో గాయపడిన భారతీయ సైనికులకు 'సంయుక్త యుద్ధ కమిటీ (సెయింట్ జాన్ అంబులెన్స్ అసోసియేషన్ మరియు బ్రిటీష్ రెడ్ క్రాస్ సౌజన్యంతో)' నేతృత్వంలో ఉపశమన చర్యలు చేపట్టారు. 03 మార్చి 1920న 'ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ'ని స్థాపించారు. నేడు భారతదేశవ్యాప్తంగా 700లకు పైగా శాఖలతో రెడ్ క్రాస్ సేవలు అందిస్తున్నారు. ప్రకృతి విపత్తులను నివారించలేకున్నా దానిని తట్టుకోవడానికి విపత్తు నిర్వహణ వ్యవస్థలను సిద్ధం చేసుకోవచ్చు.

యువతలో సేవా ప్రవృత్తిని నింపే సంస్థల్లో రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్స్, రోటరీ క్లబ్స్, యన్‌యస్‌యస్, యన్‌సిసి లాంటివి ప్రపంచవ్యాప్తంగా నిస్వార్థ ఉచిత సమాజ అవసర సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నాయి. నేను నా కోసమే కాదు మీ కోసం కూడా అనే భావనను అందరూ జీర్ణించుకోవాలి. మన జీవితాలకు ఓ పరమార్థం ఉండేలా, అభాగ్యులక అక్కున చేర్చుకునేలా, పరహితం కోసం కొంత సమయాన్ని వెచ్చించేలా మన జీవితాలను నిర్మించుకోనుటలో లభించే తృప్తి అనిర్వచనీయం. కోవిడ్-19 మహమ్మారి సృష్టించిన విపత్తు సమయమిది. నేడు రెడ్ క్రాస్ లాంటి స్వచ్ఛంధ సంస్థలతో పౌరసమాజం కలిసి పలు రకాలైన సేవలను నిర్భాగ్యులకు అందించే ప్రయత్నాలు చేద్దాం. ఆకలిగా ఉన్నపుడు ఓ ముద్ద అన్నం, దప్పికగా ఉన్నపుడు ఓ గుక్కెడు నీరు, భయకంపితులైనపుడు ధైర్యాన్ని నూరిపేయడం, అవసరార్థులకు రక్తదానం లాంటి ఏ చిన్న సేవ చేసినా కొండంత తృప్తి అనుభవంలోకి వస్తుందని గుర్తుంచుకొని పరహిత ఆలోచనలకు పదును పెడదాం. మానవీయతను రుచి చూపుదాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

మహిళలను గౌరవించే సంస్కారం అర్వింద్‌కు లేదు : విద్యాసాగర్‌రావు

హైదరాబాద్, మే 7: దౌర్భాగ్యపు ఎంపీ అర్వింద్ అనీ, మహిళలను గౌరవించే సంస్కారం ఆయనకు లేదంటూ కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మండిపడ్డారు. టీఆర్ఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని కవిత సారథ్యంలో అనేక ప్రయత్నాలు చేసినట్లు గుర్తు చేశారు. అర్వింద్ ఎవరిని తిట్టినా అది తమకే ప్లస్ అవుతుందన్నారు.

ఇకనైనా ఎంపీ చిల్లర మాటలు మానుకోవాలని హితవు పలికారు. ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ చచ్చిన పాము అనీ.. బీజేపీని ఎదుర్కోలేని దద్దమ్మ రాహుల్ అని విమర్శించారు. రాహుల్ వల్లే కాంగ్రెస్ పతనం అవుతోందని, సొంత పార్టీ నేతలే మాట్లాడుతున్నారన్నారు. విభజన హామీలపై పార్లమెంట్‌లో టీఆర్ఎస్ ఎంపీలు కొట్లాడుతుంటే రాహుల్ ఎక్కడికి పోయారంటూ ప్రశ్నించారు.

మధుర, ఇండోర్ దుర్ఘటనలపై మోదీ దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ, మే 7: ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్‌లలో జరిగిన ప్రమాదాల్లో దాదాపు 14 మంది ప్రాణాలు కోల్పోవడం పట్ల ప్రధాన మంత్రినరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పిఎంఓ ఇచ్చిన ఓ ట్వీట్‌లో, ఉత్తర ప్రదేశ్‌లోని మథురలో జరిగిన రోడ్డు ప్రమాదం హృదయ విదారకమని మోదీ తెలిపారు. ఈ ప్రమాదంలో ఆత్మీయులను కోల్పోయినవారికి ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి మృతి పట్ల తాను తీవ్ర ఆవేదన చెందుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో గాయపడినవారు సత్వరమే కోలుకోవాలని ఆకాంక్షించారు.

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో అగ్ని ప్రమాదం జరగడం తీవ్ర విచారకరమని మోదీ పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో తమ ఆత్మీయులను కోల్పోయినవారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. గాయపడినవారు సత్వరమే కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఉత్తర ప్రదేశ్‌లోని మథురలో యమున ఎక్స్‌ప్రెస్‌వేపై శనివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వీరు హర్దోయిలో ఓ వివాహానికి హాజరై తిరిగి నోయిడా వెళ్తుండగా వీరు ప్రయాణిస్తున్న కారు, వేరొక వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులు, ఓ చిన్నారి ఉన్నారు. గాయపడిన ఓ చిన్నారిని, ఓ పురుషుడిని ఆసుపత్రికి తరలించారు.

మధ్య ప్రదేశ్‌లోని ఇండోర్ నగరం, విజయ్ నగర్ కాలనీలో రెండు అంతస్థుల భవనంలో అగ్ని ప్రమాదం సంభవించిందని పోలీస్ కమిషనర్ హెచ్ఎన్ మిశ్రా చెప్పారు. ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, తొమ్మిది మంది గాయపడ్డారన్నారు. కొందరు భవనంపై నుంచి క్రిందికి దూకి ప్రాణాలను కాపాడుకున్నట్లు తెలిపారు. ఈ భవనంలో ఇరుకు ఇరుకుగా 10 ఫ్లాట్స్ ఉన్నాయని, ఊపిరి ఆడకపోవడం వల్ల కొందరు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు.

మృతుల కుటుంబాలకు రూ.4 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించనున్నట్లు మధ్య ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం, ఈ ప్రమాదానికి కారణం విద్యుదాఘాతమని తెలుస్తోంది.

యమున ఎక్స్‌ప్రెస్‌వేపై జరిగిన రోడ్డు ప్రమాదంపై ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి జనీణతి ంటతిబిఎజీనిజీబిష్ఠ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గాయపడినవారికి రాష్ట్ర ప్రభుత్వం చికిత్స చేయిస్తుందని తెలిపారు.

ఎస్.సి, ఎస్.టి యువత ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి : మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, మే 7: ఈ రోజు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎమ్ఎస్ఎమ్ఇ సంస్థ హైదరాబాద్ లోని యూసఫ్ గూడలో జరిగిన ఎస్.సి, ఎస్.టి అభ్యర్థుల సాంకేతిక శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథి గా రాష్ట్ర కార్మిక, ఉపాధి, సాంకేతిక శిక్షణ అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ మల్లారెడ్డి పాల్గొన్నారు.

భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ వారి సౌజన్యంతో ఎస్.సి, ఎస్.టి హబ్ పథకం క్రింద షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల యువత కు ఎన్ఐ-ఎమ్ఎస్ఎమ్ఇ (ఔఎ-ఓఓఇ) సంస్థ వారు అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ మేనేజర్, బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఉ ప్రీ సేల్స్ ఎనలిస్ట్, కమ్యూనికేషన్ సాఫ్ట్ స్కిల్స్ వృత్తులలో సుమారు 300 మందికి శిక్షణ ఇవ్వడం జరిగింది.

మంత్రి శ్రీ మల్లారెడ్డి శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎస్.సి, ఎస్.టి యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి ఉద్యోగం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. మన దేశంలో నైపుణ్యం ఉన్న యువత కు ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, నైపుణ్యం ఉన్న యువతకు భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. వచ్చిన చిన్న ఉద్యోగంలో చేరినప్పటికీ మరల ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. తాను కూడా చిన్న స్థాయి నుండి ఎంతో కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నానని ఆలాగే శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్.సి, ఎస్.టి యువత కూడా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరం దేశంలోనే అతిపెద్ద ఉద్యోగకల్పనా భాండాగరమని, నైపుణ్యం ఉంటే ఉద్యోగాలకు కొదవ లేదని తెలిపారు. శిక్షణ సమయంలోనే ఉద్యోగాలు పొందిన వారికీ నియామక పత్రాలను, ధృవ పత్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమం లో ఎన్ఐ-ఎమ్ఎస్ఎమ్ఇ డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరీ స్వరూప, అడిషనల్ కమిషనర్ ఆఫ్ సేల్స్ టాక్స్ శ్రీమతి కల్లెపు హరిత, ఫ్యాకల్టీ మెంబెర్స్ డాక్టర్ విజయ, డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఇంకా, సాంకేతిక శిక్షకులు పాల్గొన్నారు.

14 రాష్ట్రాలకు 7,183.42 కోట్ల రూపాయల రెవెన్యూ లోటు గ్రాంట్ విడుదల

న్యూఢిల్లీ, మే 7: ఆర్థిక మంత్రిత్వ శాఖ వ్యయ విభాగం శుక్రవారం పోస్ట్ డెవల్యూషన్ రెవెన్యూ లోటు (పిడిఆర్‌డి) గ్రాంట్ 2వ నెలవారీ విడతగా 14 రాష్ట్రాలకు 7,183.42 కోట్ల రూపాయలను విడుదల చేసింది . 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు ఈ గ్రాంట్ విడుదలైంది.

2022-23 ఆర్థిక సంవత్సరానికి 14 రాష్ట్రాలకు 15వ ఆర్థిక సంఘం మొత్తం 86,201 కోట్ల రూపాయలను డెవల్యూషన్ అనంతరం రెవెన్యూ లోటు గ్రాంటును సిఫార్సు చేసింది. సిఫార్సు చేసిన గ్రాంట్‌ని 12 సమానమైన నెలవారీ వాయిదాలలో సిఫార్సు చేసిన రాష్ట్రాలకు వ్యయ విభాగం విడుదల చేస్తుంది. తాజా విడుదలతో 2022-23లో రాష్ట్రాలకు విడుదల చేసిన రెవెన్యూ లోటు గ్రాంట్ల మొత్తం 14,366.84 కోట్ల రూపాయలకు చేరింది. .

విభజన తర్వాత రెవెన్యూ లోటు గ్రాంట్లు రాజ్యాంగంలోని ఆర్టికల్ 275 ప్రకారం రాష్ట్రాలకు కేంద్రం అందిస్తున్నది. ఆర్థిక సంఘాల సిఫార్సుల మేరకు గ్రాంట్లు రాష్ట్రాలకు విడుదల చేయబడతాయి. విభజన తర్వాత రాష్ట్రాల రెవెన్యూ ఖాతాల్లోని లోటు భర్తీ చేసేందుకు రాష్ట్రాలకు గ్రాంట్లు విడుదల చేయబడతాయి.

2020-21 నుంచి 2025-26 వరకు ఈ గ్రాంట్‌ను స్వీకరించడానికి రాష్ట్రాల అర్హత మరియు గ్రాంట్ పరిమాణాన్ని పదిహేనవ కమిషన్ అంచనా వేసిన డెవల్యూషన్‌ను పరిగణనలోకి తీసుకున్న తర్వాత సంబంధిత రాష్ట్రం రాబడి మరియు వ్యయ అంచనా మధ్య వ్యత్యాసాన్ని భర్తీ చేయడం జరుగుతుంది.

ఆంధ్రప్రదేశ్, అస్సాం, హిమాచల్ ప్రదేశ్, కేరళ, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్ మరియు పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు 2022-23లో డివల్యూషన్ అనంతర రెవెన్యూ లోటు గ్రాంట్‌ను విడుదల చేయాలని పదిహేనవ ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది.

"గో కర్త్" యంత్రాన్ని ప్రాజెక్ట్ అర్త్, ఎనాక్టస్ ఐఐటీ దిల్లీ విద్యార్థులకు అందజేసే కేంద్ర మత్స్య, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమ శాఖ మంత్రి

న్యూఢిల్లీ, మే 7: కేంద్ర మత్స్య, పశు సంవర్ధక మరియు పాడిపరిశ్రమ శాఖ మంత్రి శ్రీ పురుషోత్తం రూపాలా నేడు ప్రాజెక్ట్ అర్త్ మరియు ఇఐంఐబుూ ఐఐటీ ఢిల్లీ విద్యార్థులకు ఆవు పేడ లాగ్ మిషన్, "గో కాత్త్" యంత్రాన్ని అందజేశారు.

ఆవు పేడ లాగ్ మెషిన్, ఆవు పేడ-ఆధారిత ఇంధన కలపను పొడవాటి ఆకృతిలో తయారు చేయడానికి ఉపయోగించబడుతుంది. ఆవు పేడ మరియు పశువుల వ్యర్థాల మిశ్రమం (గడ్డి వంటివి) ఈ యంత్రం యొక్క ఇన్‌లెట్ (హాపర్)లో చేర్చబడుతుంది. యంత్రం దానిని చిన్న ముక్కలుగా చేసి కలుపుతుంది. మిశ్రమాన్ని లాగ్(చెక్క ముక్కల) ఆకారంలో కుదించబడుతుంది. ఈ లాగ్ అప్పుడు ఎండబెట్టి మరియు తరువాత వివిధ పరిస్థితులలో ఇంధన కలపగా ఉపయోగించవచ్చు.

ఈ యంత్రం ప్రతిరోజూ 3000 కిలోల ఆవు పేడను ప్రాసెస్ చేయగలదు, 1500 కిలోల ఆవు పేడ ఆధారిత కర్రలను ఉత్పత్తి చేస్తుంది, వీటిని 5-7 మృతదేహాలను దహనం చేయడానికి కట్టెలుగా ఉపయోగించవచ్చు, ప్రతి దహన సంస్కారాలలో దాదాపు 2 చెట్లను ఆదా చేయవచ్చు. అంటే ప్రతి నెలా దాదాపు 1,50,000 నుండి 1,70,000 కిలోల ఆవు పేడను తీసేసేందుకు ఇది గోశాలకు సహాయపడుతుంది. ఆవు పేడ ఆధారిత లాగ్ మెషీన్‌ను ఉపయోగించడం వల్ల గోశాల వారి వ్యర్థాల నిర్వహణ సమస్యలను తీర్చడానికి, అదంలో పనిచేసే వారికి లేదా సమీపంలోని గ్రామస్తులకు అదనపు ఉపాధిని అందించడానికి మరియు అటవీ నిర్మూలనను తగ్గించడంలో దోహదపడుతుంది. ఇది పాలు ఇవ్వని ఆవులను ఆర్థిక కార్యకలాపాలలో నిమగ్నం చేయడంలో సహాయపడుతుంది, గోశాలలోని అన్ని ఆవులను ఆదుకోవడానికి నిధులను ఉత్పత్తి చేస్తుంది.

ప్రజారోగ్యం, అభివృద్ధిపై దృష్టి సారించాలి - ఎమ్మెల్యే దాసరి

హైదరాబాద్, మే 7: ప్రజల ఆరోగ్యం తో పాటు గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే దాసరి హాజరై మాట్లాడారు. ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే గ్రామాల్లో అభివృద్ధి సాధించినట్లవుతుందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా మార్చాలని, ప్లాస్టిక్, గాజు సీసాలు, ఇనుప ముక్కలు ఇంట్లో నుంచి బయట వేయకుండా పంచాయతీ సిబ్బందికి అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఇంట్లో పండ్ల మొక్కలు పెంచాలని, మొక్కలను అందజేయనున్నట్లు తెలిపారు. ఎస్సారెస్పీ మైనర్ సబ్ మైనర్స్ ఫీల్డ్ చానల్స్‌లో పిచ్చి మొక్కల్ని పూడిక తీతతో ఈజీఎస్ కూలీల ద్వారా తొలగించాలన్నారు. రైతులు ఆయిల్ ఫామ్, మామిడి, అరటి, బొప్పాయి సాగును ఎంచుకోవాలని, ఉద్యానవన శాఖ సబ్సిడీపై అందిస్తుందన్నారు.

ఈకార్యక్రమంలో జడ్పిటిసి బొద్దుల లక్ష్మణ్, వైస్ ఎంపీపీ మొగురం రమేష్, సింగిల్ విండో చైర్మన్ కొంజర్ల వెంకటయ్య, ఎంపీటీసీలు దండే వెంకటేశ్వర్లు, అమరగాని మమత, శ్రీనివాస్, సర్పంచులు నరసింహ యాదవ్, సంతోష్ రావు, రాజయ్య, పద్మ, శకుంతల, మహంకాళి తిరుపతి, కో ఆప్షన్ లాల్ మొహ్మద్, ఇన్‌చార్జి తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో వేణుగోపాలరావు, అధికారులు అనిల్ కుమార్, సతీష్, ఏఈ సువిశాల, అశోక్, ఏపిఎం తులసి మాత, డాక్టర్ హుమాయూన్, అజారుద్దీన్, హార్టికల్చర్ జ్యోతిలు పాల్గొన్నారు.

రైల్వే మహిళా ఉద్యోగులకు సన్మానం

హైదరాబాద్, మే 7: దక్షిణ మధ్య రైల్వేలో అంకితభావంతో విశేష సేవలందిస్తూ విధులు నిర్వహిస్తున్న 125 మంది రైల్వే సిబ్బందిని, కాంట్రాక్ట్ ఉద్యోగులను దక్షిణ మధ్య రైల్వే మహిళా సంక్షేమ సంఘం (ఎస్‌సిఆర్‌డబ్ల్యుడబ్ల్యుఓ) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమాన్ని సికింద్రాబాద్ చిలకలగూడాలోని విద్యా విహార్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు

. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే మహిళా సంక్షేమ సంఘం కార్యదర్శి ఉషా జైన్, జాయింట్ ట్రెజరర్ మాధవి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉషా జైన్ మాట్లాడుతూ భారతీయ రైల్వే పురోగతికి అంకితభావంతో కృషి చేస్తున్న ఉద్యోగులను అభినందించారు. సంస్థలో ప్రతి ఉద్యోగి గౌరవ ప్రదమైన స్థానాన్ని పొందుతున్నారని అన్నారు. వారికి గౌరవమైన జీవితాన్ని గడిపే హక్కు ఉందన్నారు. వివిధ విభాగాలలో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడుతూ సన్మానం అందుకున్న వారికి ఆమె శుభాభినందనలు తెలిపారు. రైల్వే వ్యవస్థ సజావుగా సాగడానికి కృషి చేస్తున్న సిబ్బందికి తగిన గుర్తింపు లభిస్తుందని చెప్పారు.

భారతదేశ హరిత ఇంధన చొరవను సాకారం చేసేందుకు అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేసిన ఎంహెచ్ ఎ, ఎస్ఇసిఐ

న్యూఢిల్లీ, మే 7: కార్బన్ తటస్థ ఆర్థిక వ్యవస్థ దిశగా కదలేందుకు పునరావృత ఇంధనాన్ని ప్రోత్సహించాలన్న భారత ప్రభుత్వ కృషి దిశగా కేంద్ర సాయుధ పోలీసు దళాలు (సిఎపిఎఫ్‌లు), జాతీయ భద్రతా గార్డు (ఎన్ఎస్ జి) ఆవరణలలో సోలార్ ఎనర్జీ పానెళ్ళను ఏర్పాటు చేసే ప్రతిపాదన అమలుకు కేంద్ర హోం శాఖ మంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శనంలో హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. ఇందుకు అనుగుణంగా హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఎ), సోలార్జ్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఇసిఐ) న్యూఢిల్లీ కేంద్ర హోం కార్యదర్శి, నూతన ఉ పునరావృత ఇంధన మంత్రిత్వ శాఖ కార్యదర్శి సమక్షంలో మే 6 అవగాహనా ఒప్పందం (ఎంఒయు)పై సంతకాలు చేశారు. ఇంటికప్పుపై సోలార్ పివి పవర్ ప్లాంట్లను సంయుక్తంగా ఏర్పాటు చేసేందుకు రెండు పార్టీల మధ్య సహకార, సమన్వయాలను ఈ అంబ్రెల్లా (ఆధిపత్య) ఎంఒయు అంచనా వేస్తోంది .

అందుబాటులో ఉన్న డాటా ఆధారంగా సిఎపిఎఫ్‌లు ఉ ఎన్ఎస్‌జి ఆవరణలలో మొత్తం 71.68 మెగావాట్ల సౌర శక్తి సంభావ్యతను సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఇసిఐ) అంచనా వేసింది. సౌరశక్తి ప్రాజెక్టుల క్షేత్రంలో నైపుణ్యం కలిగిన ఎస్ఇసిఐ ప్రత్యక్షంగా లేదా కాంపిటీటివ్ బిడ్డింగ్ ప్రాసెస్ (పోటీ వేలం ప్రక్రియ) ద్వారా ఎంపిక చేసిన ఒక ఏజెన్సీ లేదా ఏజెన్సీల ద్వారా రూఫ్ టాప్ సోలార్ పివి పవర్ ప్లాంట్లను అమలు చేసేందుకు హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు తోడ్పడనుంది.

ఎల్‌పీజీ ధరల షాక్ - మోదీ సాబ్ యూరప్ టూర్ గిఫ్ట్ ఇదే : కాంగ్రెస్

న్యూఢిల్లీ, మే 7: కేంద్ర ప్రభుత్వం శనివారం ఎల్‌పీజీ సిలిండర్ల ధరల పెంపును ప్రకటించిన అనంతరం మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేరా విరుచుకుపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ యూరప్ టూర్‌ను ప్రస్తావిస్తూ మూడు దేశాల్లో 65 గంటలు..60 ఫోటోషూట్‌లతో హడావిడి చేసిన మోదీ సాబ్ ఎల్‌పీజీ ధరల బహుమతితో దేశానికి తిరిగివచ్చారని ఎద్దేవా చేశారు.

ఎల్‌పీజీ సిలిండర్ ధరను కేంద్రం రూ 50 పెంచడంతో సిలిండర్ ధర రేపటి నుంటి పలు ప్రాంతాల్లో ఏకంగా రూ వేయికి ఎగబాకనుంది. మోదీ ప్రభుత్వం నిత్యావసరాల ధరల పెంపుతో సామాన్యుడిపై పెనుభారం మోపుతోందని ఖేరా దుయ్యబట్టారు. సబ్సిడీ వదిలివేయాలని మోదీ సర్కార్ ప్రజలను కోరుతోందని అన్నారు. తరచూ గ్యాస్, పెట్రో ధరలు పెంచుతూ ప్రజలపై ధరల భారాన్ని మోపుతోందని అన్నారు.

ధరల మోతను తట్టుకోలేని దశలో ప్రజలు ఎల్‌పీజీ సిలిండర్లను అప్పగించే పరిస్థితి తీసుకువచ్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలను ఆదుకుంటే మోదీ ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరుస్తోందని పవన్ ఖేరా విమర్శించారు.

బస్తీ దవాఖానాలకు మహర్దశ.. అనుబంధంగా రేడియోలజీ ల్యాబ్స్

హైదరాబాద్, మే 7: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) పరిధిలో పేదల చెంతకు ప్రభుత్వ వైద్యసేవలను అందించేందుకు ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలకు మహర్దశ పట్టనుంది. ఇప్పటికే బస్తీ దవాఖానాల్లో అన్ని పరీక్షలను ఉచితంగా చేస్తున్న సంగతి తెలిసిందే. జీహెచ్ఎంసీ వ్యాప్తంగా దాదాపు 256 బస్తీ దవాఖానాలను తెలంగాణ ప్రభుతం ఏర్పాటు చేసింది. ఈ ఆస్పత్రుల్లో నిపుణులైన ఎంబీబీఎస్ డాక్టర్స్(మెడికల్ ఆఫీసర్స్) తో పాటు స్టాఫ్‌నర్సు, సపోర్టింగ్ స్టాఫ్‌తో పాటు ఇటీవలనే ఎన్‌సీడీ స్టాఫ్ నర్సులను కూడా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో తీసుకుని వైద్య సేవలందిస్తున్నారు. టీ డయాగ్నసిస్ ద్వారా సుమారు 57 రకాల పరీక్షలను ఉచితంగా అందిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. అంతేకాకుండా పాము, కుక్కకాటు, డెంగ్యూ, మలేరియా సహా అన్ని రకాల మందులను ప్రభుత ఆస్పత్తుల్లో అందుబాటులో ఉంచినట్లు ఇటీవల మంత్రి హరీష్‌రావు ప్రకటించారు. ఇలా బస్తీ దవాఖానాల్లో అన్ని రకాల పరీక్షలను పేదల ముందుకు తీసుకొచ్చిందని వైద్యారోగ్యశాఖ సైతం చెబుతోంది. వీటన్నింటికి తోడు కొత్తగా బస్తీదవాఖానాల్లో రేడియోలజీ ల్యాబ్స్‌ను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తుందని మంత్రి వెల్లడించారు.

బస్తీ దవాఖానా పనివేళ్లలో భారీ మార్పులు చేసినట్టు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ జె.వెంకటి, బస్తీ దవాఖానా హైదరాబాద్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రుక్మారెడ్డి సంయుక్తంగా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవలనే వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మేనేజింగ్ డైరెక్టర్, జాతీయ ఆరోగ్య మిషన్(తెలంగాణ ప్రభుత్వం) సంయుక్తంగా బస్తీ దవాఖానాల పనితీరుపై గత నెల 23న సమీక్షించిందని చెప్పారు. ఇందులో భాగంగా ఇంకా మెరుగైన సేవలందించేందుకు పలు నిర్ణయాలు తీసుకున్నారని వెల్లడించారు. ఇక నుంచి బస్తీ దవాఖానాలు ఆదివారం రోజుల్లో కూడా పని చేస్తాయని తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కూడా పని చేస్తాయని వెల్లడించారు. ప్రతి శనివారం రోజు మాత్రం బస్తీ దవాఖానాలు బంద్ ఉంటాయని పేర్కొన్నారు. ఈ నిబంధనలను హైదరాబాద్ జిల్లాతో పాటు శివారు జిల్లాలైన రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలతో పాటు సంగారెడ్డి జిల్లాల్లో నెలకొల్పబడిన బస్తీ దవాఖానాలకు మాత్రమే వర్తిస్తాయని వారు వివరించారు.

దిక్కులేని నావలా కాంగ్రెస్ : మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, మే 7: దిక్కులేని నావలా కాంగ్రెస్ పార్టీ మారిందని, ఆ పార్టీతో ఎవరూ పొత్తులు పెట్టుకోరని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్‌పై మంత్రి ఘాటుగా స్పందించారు. దేశంలో కాంగ్రెస్, బీజేపీ దొంగ పార్టీలనీ.. ఆ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా దేశంలో కేసీఆర్ కొత్త మోడల్‌తో అభివృద్ధికి శ్రీకారం చుడుతారన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన వరంగల్ డిక్లరేషన్ సభ బూమరాంగ్ అయ్యిందని ఎద్దేశా చేశారు. వరంగల్ సభ ఆధిపత్య ఘర్షణ తప్ప.. రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. డిక్లరేషన్‌లో కాంగ్రెస్ గత ఎన్నికల ముందు చెప్పిన విషయాలే మళ్లీ ఇప్పుడు కొత్తగా చెప్పిందన్నారు.

రాష్ట్ర నాయకుల స్క్రిప్ట్ చదవడం తప్ప రాహుల్ గాంధీ తెలంగాణకు కొత్తగా చెప్పిందేమీ లేదన్నారు. అసలు రాహుల్ గాంధీ ఏ హోదాలో డిక్లరేషన్ చేశారని, అది తెలంగాణకు పరిమితమా? లేదంటే జాతీయా విధానామా? చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణాలో బలం లేదని, పార్టీని నడపలేక పారిపోయిన రాహుల్ చేసిన డిక్లరేషన్‌ను ప్రజలు పట్టించుకోరన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో రైతులకు మద్దతు ధర లభించక అక్కడి రైతులు తెలంగాణ మిల్లులకు వచ్చి ధాన్యం అమ్ముకొని వెళ్తున్న విషయాన్ని మంత్రి జగదీశ్‌రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ గురించి కాంగ్రెస్ మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లేనని, కాంగ్రెస్ కొంగ జపాలకు రాష్ట్ర ప్రజలు మోసపోరన్నారు.

మహమ్మారి కాలంలో 1000కు పైగా శాఖలను తెరిచిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

హైదరాబాద్, మే 7: తమ ప్రాజెక్ట్ ఫ్యూచర్ రెడీలో భాగంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాము తమ నెట్‌వర్క్ కు గత రెండు సంవత్సరాల కాలంలో 1000కు పైగా నూతన శాఖలను జోడించినట్లు- వెల్లడించింది. ఈ మహమ్మారి కాలంలో బ్యాంక్ ప్రతిరోజూ రెండు నూతన శాఖలను ప్రారంభించింది. ఒక్క 2022 ఆర్థిక సంవత్సరంలోనే 734 శాఖలను ఇది తెరిచింది. ఈసందర్భంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రిటైల్ బ్రాంచ్ బ్యాంకింగ్ కంట్రీ హెడ్ అరవింద్ పోద్రో మాట్లాడుతూ? రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ కళకు మరింత సైన్స్ జోడించడం ద్వారా ఈ ఛానెల్‌ను పునరావిష్కరించడం తమ శాఖల బ్యాంకింగ్ వ్యూహంలో భాగమన్నారు. తమ శాఖలు బ్యాంకును తమ వినియోగదారులు, సమాజం, ఇతర వాటాదారులకు చేరువ చేస్తాయన్నారు. అవి రిటైల్, బిజినెస్ కస్టమర్ సంబంధాలను కలిగి ఉంటాయన్నారు. తాము తమ శాఖలను ఫిజిటల్ మౌలిక వసతుల ఎస్సెట్స్‌గా మారుస్తున్నామని తెలిపారు.



అక్రమ రవాణారహిత దేశంగా భారత్‌ను చేసేందుకు అసోసియేషన్ ఫర్ వాలెంటరీ యాక్షన్‌తో అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేసిన రైల్వే భద్రతా దళం (ఆర్‌పిఎఫ్)

న్యూఢిల్లీ, మే 7: అక్రమ రవాణా రహిత దేశంగా భారత్‌ను చేసేందుకు అసోసియేషన్ ఫర్ వాలెంటరీ యాక్షన్ (ఎవిఎ)తో రైల్వే భద్రతా దళం (ఆర్‌పిఎఫ్) అవగాహనాపత్రంపై సంతకాలు చేసింది.

దేశాన్ని అక్రమరవాణా రహితం చేయాలన్న సామాన్య లక్ష్యం కోసం కలిసి పని చేయాలన్న దృక్పథంతో కైలాశ్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ (కెఎస్‌సిఎఫ్) సిఇఒ రజనీ సిబాల్‌తో శ్రీ కైలాస్ సత్యార్థి సమక్షంలో 8 ఏప్రిల్, 2022న ఆర్‌పిఎఫ్ డిజి శ్రీ సంజయ్ చందర్ వివరణాత్మక చర్చలకు శ్రీకారం చుట్టారు. బచ్‌పన్ బచావ్ ఆందోళన్‌గా అని కూడా పరిచితమైన ఎవిఎ, ఆర్‌పిఎఫ్ కలిసి ఎంఒయుపై చేసిన సంతకాల ద్వారా ఈ చర్చలను ముందుకు తీసుకువెళ్ళారు. ఈ సందర్భంగా వారు, సమాచారాన్ని పంచుకోవడానికి కలిసి పని చేస్తామని, అక్రమరవాణాకు వ్యతిరేకంగా ఆర్‌పిఎఫ్ సిబ్బంది, రైల్వే ఉద్యోగులు పనిచేసేందుకు వారి సామర్థ్య నిర్మాణం, వారిలో ఉత్తేజనను (సెన్సిటైజేషన్) పెంచడం, అవగాహనను సృష్టించడమే కాక, అక్రమరవాణా కేసులను గుర్తించడం, ఆచూకీ తీయడంలో ఒకరికొకరు తోడ్పడాలని ప్రతిజ్ఞ చేశారు. ఎంఒయు చట్రం కింద ఇద్దరు భాగస్వాములతో సంయుక్త చర్య తప్పనిసరిగా, దేశవ్యాప్తంగా ఆర్‌పిఎఫ్ ప్రారంభించిన ఆపరేషన్ ఎఎహెచ్‌టి (యాక్షన్ ఎగనెస్ట్ హ్యూమన్ ట్రాఫికింగ్ – అక్రమరవాణాకు వ్యతిరేకంగా చర్య) పరిధిని, స్థాయిని పెంచనుంది.

రైల్వే భద్రతా దళానికి రైల్వే ఆస్తులు, ప్రయాణీకుల ప్రాంతం, ప్రయాణీకుల భద్రతా బాధ్యతను అప్పగించారు. రైల్వే మంత్రిత్వ శాఖ పిల్లలను కాపాడడంపై జారీ చేసిన ప్రామాణిక కార్యనిర్వహణ పద్ధతికి అనుగుణంగా ఈ భాధ్యతను నిర్వర్తిస్తూ, 2018లో ప్రారంభించిన ఆపరేషన్ నన్హే ఫరిష్తే కింద ఇతర భాగస్వాములతో 50,000మందికి పైగా పిల్లలను కాపాడేందుకు కలిసి పని చేస్తోంది. రైలు ద్వారా అక్రమ రవాణాకు వ్యతిరేకంగా కఠిన చర్యలు చేపట్టేందుకు ఆపరేషన్ ఎఎహెచ్‌టిని ప్రారంభించి, అక్రమరవాణాదారుల పంజా నుంచి బాధితులను కాపాడుతోంది. అక్రమరవాణాదారులకు వ్యతిరేకంగా చర్య తీసుకోవడంలో భాగంగా అది 298 మైనర్ ఆడపిల్లలు సహా 1400 మంది మైనర్లను కాపాడింది. భారతదేశ వ్యాప్తంగా 740 ప్రాంతాలలో ఆర్‌పిఎఫ్ అక్రమరవాణా వ్యతిరేక యూనిట్లను (ఎహెచ్‌టియు)లను ఏర్పాటుచేసి, ఈ క్షేత్రంలో పని చేసే ఇతర ఏజెన్సీల సమన్వయంతో అక్రమ మానవ రవాణాకు వ్యతిరేకంగా చర్య తీసుకోవలసిందిగా ఆదేశించింది.

పిల్లలకు వ్యతిరేకంగా అన్ని రూపాల హింసను తొలగించి, పిల్లలు స్వేచ్ఛగా, భద్రంగా, ఆరోగ్యంగా ఉంటూ నాణ్యత కలిగిన విద్యను అందించే ప్రపంచాన్ని సృష్టించాలన్న సంకల్పంతో నోబుల్ గ్రహీత కైలాస్ సత్యార్థి 1979లో ప్రారంభించిన కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్‌తో కలిసి బచ్‌పన్ బచావ్ ఆందోళన్‌గా కూడా తెలిసిన అసోసియేషన్ ఆఫ్ వాలెంటరీ యాక్షన్ పని చేస్తోంది, అనుబంధంగా ఉంది. పిల్లల భద్రతకు సంబంధించి నిబంధనా చట్రాన్ని లేదా అత్యుత్తమ అచరణలను గుర్తించి, వాటి ప్రతికృతి విధానాన్ని అమలు చేయడం, విధులలో ఉన్నవారి సామర్థ్య నిర్మాణం, జాతీయ, అంతర్జాతీయ విధానాలను బలోపేతం చేయడం, సమన్వయంతో కూడిన చర్యల ద్వారా ఈ మిషన్‌ను సాధించాలన్న లక్ష్యంతో ఎవిఎ పని చేస్తోంది. బిబిఎ పిల్లల అక్రమరవాణాకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులతో/ ఆర్‌పిఎఫ్‌తో పంచుకోవడమే కాక, బాధితులను కాపాడేందుకు/ అక్రమరవాణాదారులను అరెస్టు చేసేందుకు తోడ్పడుతూ, పిల్లల అక్రమరవాణాకు వ్యతిరేకంగా చర్య అన్న క్షేత్రంలో జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని సేకరించింది.

దేశంలో ప్రాథమిక రవాణా సంస్థ భారతీయ రైల్వేలు అయినందున, కనుక అక్రమరవాణాదారులు రవాణా చేసేందుకు ప్రధానమార్గంగా ఉంది. బాధితుడు/ రాలు గమ్యాన్ని చేరి, దోపిడీ ప్రారంభమయ్యే ముందే ఈ అక్రమరవాణాను దారిలోనే నిరోధించేందుకు రైల్వే స్టేషన్లలోనూ, రైళ్ళలోనూ ఆర్‌పిఎఫ్ సిబ్బందిని వ్యూహాత్మకంగా మోహరించారు. ఈ వ్యూహాత్మక స్థానాలు, దేశవ్యాప్త విస్తరణ కారణంగా, మానవ అక్రమరవాణాను .అరికట్టడంలో దేశ కృషికి ఆర్‌పిఎఫ్ అదనపు తోడ్పాటుగా ఉండగలదు.

అందరికీ వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉండేలా చూడడానికి భారతదేశం కట్టుబడి ఉంది - కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, మే 7:శాస్త్ర సాంకేతిక శాఖ (స్వతంత్ర), భూ శాస్త్ర సహాయ (స్వతంత్ర), ప్రధానమంత్రి కార్యాలయం, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, అందరికీ వ్యాక్సిన్‌లను అందుబాటులోకి తీసుకురావడానికి మరియు అందుబాటు ధరలో ఉండేలా చూడడానికి భారతదేశం కట్టుబడి ఉందని అన్నారు.

ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల కోసం సైన్స్, టెక్నాలజీ మరియు ఇన్నోవేషన్ పై ఏడవ వార్షిక బహుళ వాటాదారుల ఫోరంను ఉద్దేశించి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, డబ్ల్యూహెచ్‌ఓలో ఈక్విటీ సూత్రం కోసం భారతదేశం బలంగా వాదిస్తోందని, దక్షిణాఫ్రికాతో పాటు, కోవిడ్ వ్యాక్సిన్లు, డయాగ్నోస్టిక్స్ మరియు మందుల కోసం డబ్ల్యుటిఓ వద్ద ట్రిప్స్ మాఫీని కూడా ప్రతిపాదించిందని చెప్పారు. ఈ లక్ష్యాన్ని సాకారం చేసుకోవడానికి గ్లోబల్ అల యెన్స్ ఫర్ వ్యాక్సిన్స్ అండ్ ఇమ్యునైజేషన్ (జిఎవిఐ), ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ వో), కోవిడ్ –19 టూల్స్ (ఏసీటీ) యాక్సిలరేటర్లతో కలిసి భారతదేశం చురుగ్గా పనిచేస్తోందని ఆయన చెప్పారు.

2030 ఎజెండా ఫర్ సస్టైనబుల్ డెవలప్మెంట్ పూర్తి అమలును ముందుకు తీసుకువెళుతూ, కరోనావైరస్ వ్యాధి (కోవిడ్–19) నుండి మరింత మెరుగ్గా తిరిగి రావడానికి సైన్స్, టెక్నాలజీ మరియు ఆవిష్కరణలపై ఈ సంవత్సరం బహుళ–వాటాదారుల ఫోరం దృష్టి సారిస్తోంది.కోవిడ్‌కు ప్రపంచ ప్రతిస్పందనలో డిజిటల్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యొక్క అపారమైన శక్తి కీలకమైన అంశం అని డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రతినిధులకు చెప్పారు. డిజిటల్ స్పేస్‌లో భారతదేశం యొక్క బలాన్ని ఉపయోగించి, టీకా డ్రైవ్‌లను మెరుగ్గా నిర్వహించడానికి డిజిటల్ మద్దతును అందించడానికి, భారతదేశం అభివృద్ధి చేసిన అనీ–చిఎజె యాప్‌ని ప్రపంచంతో పంచుకోవాలని న్యూ ఢిల్లీ నిర్ణయించుకుంది. భారతదేశం చాలా కాలంగా సైన్స్ టెక్నాలజీ మరియు ఇన్నోవేషన్‌ను ప్రోత్సహిస్తోందని మరియు విప్లవాత్మక ఆలోచనలను పొదిగించడానికి మరియు స్కేల్ చేయడానికి, ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచడానికి మరియు ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను అందించడానికి సహాయపడే పర్యావరణ వ్యవస్థను పెంపొందిస్తోందని మంత్రి అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది మరింత కీలకంగా మారిందని ఆయన అన్నారు.

గత రెండేళ్లుగా మహమ్మారి వల్ల తలెత్తిన సవాళ్లను అధిగమించడానికి ప్రపంచవ్యాప్త కృషిని ప్రస్తావిస్తూ, వ్యాక్సిన్ పరిశోధనలో ప్రముఖ అంతర్జాతీయ శాస్త్రీయ కూటమిలో భారతదేశం సభ్యదేశంగా ఆవిర్భవించిందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ప్రపంచంలోని మొట్టమొదటి డిఎన్ఎ ఆధారిత వ్యాక్సిన్తో సహా సురక్షితమైన, సమర్థవంతమైన మరియు సరసమైన వ్యాక్సిన్లను అభివృద్ధి చేయడంలో మరియు ఉత్పత్తి చేయడంలో మా శాస్త్రీయ సమాజం, బలమైన బలమైన ఔషధ పరిశ్రమ మద్దతుతో పాటు విజయవంతమైందని మంత్రి ఉద్ఘాటించారు.

కోవిడ్–19 కేసులపై ప్రస్తుత డేటా మహమ్మారి అనంతర ప్రపంచానికి మనం ఇంకా దూరంగా ఉన్నామని నిరూపిస్తుందని, వనరులను సమీకరించడం మరియు జ్ఞానాన్ని పంచుకోవడం ద్వారా అర్థవంతమైన భాగస్వామ్యానికి పిలుపునిచ్చామని భారత మంత్రి సభ్యులను హెచ్చరించారు. కోవిడ్–19కు సంబంధించి మన సమిష్టి ప్రతిస్పందనను వేగవంతం చేయడానికి, సుస్థిర అభివృద్ధి దిశగా సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ సహకారం కీలకమని ఆయన అన్నారు. సరసమైన, అందుబాటు ధరలో మరియు అందుబాటులో ఉన్న సాంకేతిక ఆవిష్కరణల ఆధారంగా ౫ఆఉ (సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు) డెలివరీ కొరకు ఎస్ టిఐ ఒక సమ్మిళిత, సమానమైన సాధనంగా మారాలని ఆయన పునరుద్ఘాటించారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, సాంకేతికతతో నడిచే సృజనాత్మక వ్యాపార నమూనాలు మరియు సేవా డెలివరీ ఖర్చు–సమర్థవంతమైన, పారదర్శకమైన మరియు కలుపుకొని ఉన్న పద్ధతిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనను వేగంగా ట్రాక్ చేయడానికి విస్తారమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. అయితే స్థిరమైన అభివృద్ధికి సంబంధించిన సవాళ్లను పరిష్కరించడానికి అభివృద్ధి చెందుతున్న దేశాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మనం సులభతరం చేయాలి. భారతదేశంలో, మహమ్మారి అనంతర పునరుద్ధరణలో సైన్స్ అండ్ టెక్నాలజీ కీలకమైన సాధనంగా మారిందని, మేము మరింత మెరుగ్గా అభివృద్ధి చెందుతామని, తక్కువ ఖర్చుతో కూడిన, అభివృద్ధి చెందే మరియు పౌరులందరికీ, ముఖ్యంగా మహిళలకు సాధికారత కల్పించడానికి రూపొందించినసాంకేతిక పరిష్కారాలను ఉపయోగించుకోవడం ద్వారా భారతదేశం డిజిటల్ విభజనను తగ్గించుకుంటోందని ఆయన అన్నారు. నేడు గ్రామాల్లో ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య నగరాలు మరియు ప్రజా సేవల కంటే మించిపోయింది మరియు చివరి మైలు డెలివరీ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లతో అనుసంధానించబడి ఉంది. ఇవన్నీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు దోహదపడ్డాయని మంత్రి పేర్కొన్నారు.

దక్షిణ–దక్షిణ సహకార స్ఫూర్తితో, ఆఫ్రికా మరియు ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందిన పైలట్ దేశాలకు మద్దతు ఇవ్వడంలో టెక్నాలజీ ఫెసిలిటేషన్ మెకానిజం మరియు ఐక్యరాజ్యసమితి యొక్క ఇంటర్ ఏజెన్సీ టాస్క్ టీమ్ (ఐఎటిటి) తో భారతదేశం సహకరిస్తోందని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల రోడ్ మ్యాప్ ల కోసం వారి సైన్స్, టెక్నాలజీ మరియు ఇన్నోవేషన్ ను రూపొందించడం తో పాటు అమలు చేయడంలో కూడా సహకారం అందిస్తుందని డాక్టర్ జితేంద్ర సింగ్ తన ముగింపు ప్రసంగంలో తెలిపారు.

ఫిట్ ఇండియా మూవ్‌మెంట్‌ను ప్రధాని ప్రారంభింభిస్తూ మనం ఆరోగ్యంగా తినాలి, ఆరోగ్యంగా ఉండాలి అనే స్పష్టమైన సందేశాన్ని అందించారు

కాశ్మీర్‌లో 'మీట్ ది ఛాంపియన్స్' సందర్భంగా ఒలింపియన్ ఆరిఫ్ ఖాన్

న్యూఢిల్లీ, మే 7:జమ్మూ & కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లోని ప్రభుత్వ ఎస్పీ మోడల్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో శుక్రవారం 'మీట్ ది ఛాంపియన్స్' అనే ప్రత్యేకమైన ప్రచారం మొదలయింది.

కశ్మీర్ లోయకు చెందిన దేశంలోని స్టార్ వింటర్ ఒలింపియన్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్కు విద్యార్థులు అద్భుతమైన స్వాగతం పలికారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న ఈ విశిష్ట చొరవ 17వ ఎడిషన్ ఈరోజు మొదలయింది. సుందరమైన లోయలోని పురాతన పాఠశాలలో దాదాపు 200 మంది విద్యార్థులతో ఇండియన్ ఆల్పైన్ స్కీయర్ (ఖాన్) మాట్లాడుతూ, "మన ప్రధాన మంత్రి ఫిట్ ఇండియా ప్రచారోద్యమాన్ని ప్రారంభించడం ద్వారా మనలో ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా సరైన ఆహారం తీసుకోవాలని ఫిట్‌నెస్‌ను మన దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని చాటి చెప్పారు. ప్రతి భారతీయుడికి ఇది స్పష్టమైన సూచన"అని వివరించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యమని చెప్పిన ఆరిఫ్, "సంతులిత్ ఆహార్ (సమతుల్య ఆహారం) అంటే మీరు సమీపంలోని కేఫ్‌కి వెళ్లడం మానేయమని కాదు, కానీ మీరు తినే ఏదైనా సమతుల్యంగా తినాలి" అని వివరణ ఇచ్చారు.

ఇదిలా ఉండగా, ఆహారం, ఫిట్‌నెస్, లోయలో వారు ఎదుర్కొనే సవాళ్లు, క్రీడలు విద్యావేత్తలను సమతుల్యం చేసే మార్గాలు మొదలైన వాటికి సంబంధించిన అనేక ప్రశ్నలకు ఆయన ఉత్సాహంగా సమాధారం చెప్పారు.

ఉత్సుకతతో సంభాషించిన విద్యార్థులతో మాట్లాడారు. ఎస్పీ హెచ్ఎస్ఎస్ విద్యార్థి ఒకరు ఇలా అడిగారు, "కశ్మీర్ అంతర్జాతీయ స్కీయర్‌లను సంపాదించేందుకు మీరు ఎలాంటి మౌలిక నదుపాయాల మార్పులను కోరుకుంటున్నారు?" ఇందుకు ఆయన బదులిస్తూ "వివిధ సమస్యలు పరిస్థితుల కారణంగా నేను చాలా అవకాశాలను వదులుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. నేను కోరుకున్నదానిపై నేను ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాను కాబట్టి నేను ఎప్పుడూ అలా చేయలేదు. కాబట్టి, మీరు చేయాలనుకుంటున్నది చేయండి ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించండి, కానీ ఎప్పటికీ వదులుకోవద్దు, "అని బీజింగ్ వింటర్ ఒలింపిక్స్‌కు దేశం ఏకైక ప్రతినిధి అయిన ఖాన్ బదులిచ్చారు. సేంద్రియ ఆహారం, తాజా పండ్లు దానిలో చాలా పోషకాలను కలిగి ఉన్న కశ్మీర్ వంటకాలను తినాలని, ఈ విషయంలో కాశ్మీర్ ఎంతో గొప్పదని ఖాన్ విద్యార్థులకు వివరించారు. "మన రెగ్యులర్, ఇంటి భోజనంలో చాలా పోషకాహారం ఉంది. లోయలో ఉన్నందుకు మనమందరం ఎంత అదృష్టవంతులమో మనం అర్థం చేసుకోవాలి. మనకు వివిధ పండ్లతో కూడిన తోటలు ఉన్నాయి. మనం ఇప్పటికీ స్వచ్ఛమైన గాలిని పీల్చుకుంటాము. కాబట్టి, మనం ఫిట్‌గా ఉండడానికి కావలసిన ప్రతిదీ మనకు అందుబాటులో ఉంది "అని ఆరిఫ్ చెప్పాడు. ఈ విశిష్ట చొరవను యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ విద్యా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో ఈ కార్యక్రమం భాగం.

ప్రభుత్వ పాఠశాలలను తక్కువగా అంచనా వేయొద్దు : మంత్రి సబిత

నాగర్‌కర్నూల్, మే 7:: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను రూ.7,300 కోట్లతో 'మన ఊరు ? మన బడి' పథకం కింద అభివృద్ధి చేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా మేడిపూర్‌లో మన ఊరు ? మన బడి పథకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను తక్కువగా అంచనా వేస్తుంటారనీ, సీఎం కేసీఆర్ చేస్తున్న విద్యా యజ్ఞానికి ఉపాధ్యాయులు పాత్రదారులు కావాలన్నారు. రాష్ట్రం సాధించి వ్యవసాయం, సాగునీటి రంగంలో అభివృద్ధి సాధించినట్లు పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో మార్పు కోసం రాష్ట్రంలో వెయ్యి గురుకులాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఒక్కో స్టూడెంట్‌పై రూ.1.20లక్షలు ఖర్చు చేస్తున్నామని, రాష్ట్రంలో 26వేల స్కూళ్లను 'మన ఊరు ? మన బడి' ద్వారా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపకుండా.. ఇంగ్లీష్ చదువుల కోసం ప్రైవేట్ స్కూళ్లకు పంపిస్తున్నారని, దీన్ని గురించి సీఎం కేసీఆర్ వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతుందన్నారు. పిల్లలు, ఉపాధ్యాయులు ఆందోళన పడొద్దన్నారు. రాష్ట్రంలో అక్షరాస్యతను 65శాతం నుంచి వంద శాతానికి చేర్చుకుందామని పిలుపునిచ్చారు.

తరగతి గదుల్లో కావాల్సిన అన్ని నదుపాయాలను కల్పించడం జరుగుతుందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో రూ.103కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు.

గుడిలా బడిని పవిత్రంగా చూడాలని, రాష్ట్రంలో ఉన్నత విద్యాసంస్థల్లో అమ్మాయిల సంఖ్య పెరుగుతోందని, ఇంటర్ తర్వాత కెరియర్‌ను ఎంచుకునే స్థాయికి చేరుతారన్నారు. అమ్మాయిలు బాగా చదువుతున్నందుకే మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు.

సీఎం కేసీఆర్ తీసుకుంటున్న చర్యలతో రాబోయే ఐదేళ్లలో తెలంగాణ పిల్లలు ఉన్నత స్థానాల్లో ఉంటారనీ, పది పరీక్షల్లో విద్యార్థులు బాగా రాయాలన్నారు. కలెక్టర్ అధికారులు, పాఠశాలల్లో పనులు పూర్తయ్యేలా చూడాలనీ,మిషన్ భగీరథ, మిషన్ కాకతీయలాంటి పథకాల మాదిరిగా మన ఊరు–మన బడిని విజయవంతం చేయాలన్నారు.

విజన్ టుడే ఆధ్వర్యంలో సమ్మర్ స్పోకెన్ ఇంగ్లీషు-గ్రామర్ క్యాంపు

రాజన్న సిరిసిల్ల, మే 7:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణంలోని జవహర్ లాల్ నెహ్రూ విద్యాసంస్థలో శనివారం విజన్ టుడే ఇన్స్టిట్యూట్ వారు మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లీషు-గ్రామర్ క్లాసుల సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ

రూరల్ ఏరియాల్లో ఉన్న విద్యార్థులకు, ఉద్యోగులకు, గృహిణులకు 45 రోజులపాటు (45 పీరియడ్స్) స్పోకెన్ ఇంగ్లీషు నేర్పాలనే ఉద్దేశ్యంతో ఇట్టి కోర్సును ప్రారంభించినట్లు తెలిపారు. దీనికి గాను 1200 ఫీజును నిర్ణయించినట్లు పేర్కొన్నారు.కోర్సు అనంతరం పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేయనున్నట్లు విజన్ టుడే నిర్వాహకులు తెలిపారు. ఇట్టి స్పోకెన్ ఇంగ్లీషు గ్రామర్ క్లాసులు ఉదయం 8.30 నుండి 12 గంటలవరకునిర్వహించబడునని తెలిపారు. 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు మాథ్స్ బేసిక్స్ కూడా నేర్పించబడునని తెలియజేశారు. ఇట్టి సదవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు.

మహాజనుల రాజ్య స్థాపనకు ప్రతి ఒక్కరు సిద్ధం కావాలి

--ఎంఎస్పి కరీంనగర్ జిల్లా ఇంచార్జి ఇజం వెంకటస్వామి

రాజన్న సిరిసిల్ల, మే 7:(నేటినిజం ప్రతినిధి):మహాజనుల రాజ్య స్థాపనకు ప్రతి ఒక్కరు సిద్ధం కావాలని ఎంఎస్పి కరీంనగర్ జిల్లా ఇంచార్జి ఇజం వెంకటస్వామి అన్నారు. శనివారం వేములవాడ పట్టణంలో మహాజన సోషలిస్టు పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి ఇంజనీ వెంకటస్వామి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కావాల్సింది దొరల తెలంగాణ కాదని మహా జనుల తెలంగాణ అన్నారు. మహాజనుల తెలంగాణ వస్తే సామాజిక న్యాయం జరుగుతుందని, దొరల పాలనలో అసగారిన వర్గాలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. రాష్ట్రంలో దొరల పాలన పోయి మహా జనులా రాజ్య స్థాపన కొరకు ప్రతి ఒక్కరు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో దొర పాలనకు చమర గీతం పాడి మహాజనుల రాజ్యం కోసం పోరాటం చేస్తూ రాజ్యాధికారం సాధించే దిశగా అన్ని వర్గాలను ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా ఇన్చార్జి ఆవునూరి ప్రభాకర్,జిల్లా కోఆర్డినేటర్ దుమాల లక్ష్మణ్, కోకో ఆర్డినేటర్ గుండా థామస్, బొల్లారం చంద్రమౌళి, నేదురి బాబు,నెదూరి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యానికి ఈ భాగస్వామ్యం ఒక ముందడుగుతిరుపతిలో స్మైల్ ట్రైన్ గ్రహణం మొర్రి ట్రీట్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్

హైదరాబాద్, మే 7: రాష్ట్రంలో చిన్నారుల ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగుపరచడంలో ఈ భాగస్వామ్యం ఒక ముఖ్యమైన ముందడుగు అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉద్ఘాటించారు. గ్రహణం మొర్రి చికిత్సను ఉచితంగా అందించేందుకు స్మైల్ ట్రైన్ ఇండియాతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాగస్వామ్యం అయింది. బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సర్జరీ, రీసెర్చ్ అండ్ రిహాబిలిటేషన్ ఫర్ ది డిసేబుల్డ్ లో స్మైల్ ట్రైన్ ఇండియా భాగస్వామ్యంతో అత్యాధునిక క్లెఫ్ట్ కేర్ సదుపాయం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ బాలాజీ హాస్పిటల్‌లో చిన్నారులకు అవసరమైన చికిత్స, రోగనిర్ధారణ సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రం గ్రహణం మొర్రి పిల్లల ఆరోగ్య సంరక్షణకు పని చేయనుందని తెలిపారు. ఈ సందర్భంగా స్మైల్ ట్రైన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, ఆసియా రీజినల్ డైరెక్టర్ మమతా కారోల్ మాట్లాడుతూ ప్రభుత్వ సహాయం లేకుండా గ్రహణం మొర్రి చికిత్సలో పాలసీ స్థాయి మార్పును సాధించడం సాధ్యం కాదన్నారు. చాలా మంది పిల్లలకు పూర్తి పునరావాసం కోసం స్పీచ్ థెరపీ, ఆర్థోడాంటిక్స్, సెకండరీ సర్జికల్ విధానాలు వంటి దీర్ఘకాలిక ముఖ్యమైన సంరక్షణ అవసరమన్నారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం 35 వేల మందికి పైగా పిల్లలు గ్రహణం మొర్రితో పుడుతున్నారని పేర్కొన్నారు. చికిత్స చేయని గ్రహణం మొర్రి ఉన్న లక్షలాది మంది పిల్లలు ఒంటరిగా నివసిస్తున్నారని తెలిపారు. వారి కుటుంబాలు చీలిక సంరక్షణను భరించలేనందున తినడం, శ్వాస తీసుకోవడం, వినడం, మాట్లాడటం కష్టమవుతుందన్నారు. స్మైల్ ట్రైన్ ఇండియా స్థిరమైన మోడల్ స్థానిక వైద్య నిపుణులకు వారి స్వంత కమ్యూనిటీలలో చికిత్సను అందించడానికి శిక్షణ, సాధికారతపై దృష్టి పెడుతుందని వివరించారు. స్మైల్ ట్రైన్ ఇండియా భారతదేశం అంతటా 150పైగా భాగస్వామ్య ఆసుపత్రుల ద్వారా ఆరు లక్షల యాభై వేల మంది కంటే ఎక్కువే ఉచిత గ్రహణం మొర్రి శస్త్రచికిత్సలకు మద్దతు ఇచ్చిందన్నారు.

ప్రజలను రెచ్చగొడుతున్న చంద్రబాబు : మంత్రి అంబటి

అమరావతి, మే 7:టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలను రెచ్చగొడుతున్నారని ఏపీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ? పన్నులు వేయకుండానే చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని నడిపారా..? అని మంత్రి అంబటి రాంబాబు ప్రశ్నించారు. ప్రజలను చంద్రబాబునాయుడు కావాలనే రెచ్చగొడుతున్నారన్నారు. చంద్రబాబు రాజకీయ సన్యాసం తీసుకుంటారా..? అని అడిగారు. ఏపీ కంటే మహారాష్ట్రలో ఆర్టీసీ చార్జీలు ఎక్కువని అన్నారు.

సరిహద్దు ప్రాంతాల అభివృద్ధితో న్యూ ఇండియా నిర్మాణం: రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

న్యూఢిల్లీ, మే 7:సరిహద్దు ప్రాంతాల అభివృద్ధితో స్థానిక ప్రజల్లో భద్రతపై అవగాహన పెరుగుతుందని, మెరుగైన వసతులు కల్పించడం ద్వారానే ఇది సాధ్యమవుతుందన్నారు కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్. ఇవ్వాల (శనివారం) జరిగిన బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (BRO) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన రీతిలో ఉపయోగించడం ద్వారా దాని సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాలని మరియు సరిహద్దు ప్రాంతాల మౌలిక సదుపాయాలను వేగంగా బలోపేతం చేయడానికి కృషి చేయాలని సరిహద్దు రోడ్ల సంస్థ(BRO)కి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఈ మధ్య కాలంలో ఉత్తర సెక్టార్‌లో చైనా ఉనికి పెరిగిందని, పర్వత ప్రాంతాల నిర్మాణంలో వారి నైపుణ్యం కారణంగా చాలా త్వరగా వివిధ ప్రాంతాలకు చేరుకోగలుగుతున్నారని పేర్కొన్నారు. వారికి దీటుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా వినియోగించుకుని తమ సామర్థ్యాన్ని పెంపొందించడంపై ఃఖీా దృష్టి సారించాలి అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం కూడా ఃఖీాకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తోందని రాజ్నాథ్ తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలోBRO యొక్క మూలధన బడ్జెట్‌ను 40% అంటే.. రూ3,500 కోట్లకు పెంచుతున్నట్లు తెలిపారు. కేవలం బడ్జెట్ మాత్రమే కాకుండా, ఈ ప్రయత్నంలో సాధ్యమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఆయన BROకి హామీ ఇచ్చారు.

సరిహద్దు ప్రాంతాల అభివృద్ధిని ప్రభుత్వం సమగ్ర రక్షణ వ్యూహంలో ప్రధాన భాగమని రక్షణ మంత్రి అభివర్ణించారు. ఇది దేశ భద్రతా యంత్రాంగాన్ని బలపరుస్తుందని, మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజల జీవితాల్లో సానుకూల మార్పును తీసుకువస్తుందని పేర్కొన్నారు. రక్షణ వ్యూహంలో ప్రజల భాగస్వామ్యం కూడా కీలక భాగమని ఆయన పేర్కొన్నారు. సరిహద్దు ప్రాంతాల ప్రజలు ఎంత శక్తివంతం అవుతారో, ఆ ప్రాంతాల భద్రత గురించి వారు మరింత అవగాహన కలిగి ఉంటారు.

పౌరులు దేశం యొక్క గొప్ప శక్తి. కాబట్టి, మారుతున్న కాలానికి అనుగుణంగా, మన సరిహద్దు ప్రాంతాల అభివృద్ధికి ముందుకు వెళ్లడానికి తాము కట్టుబడి ఉన్నామని, భద్రత కోసం 24 గంటలూ పనిచేసే వారికి ఆధునిక సౌకర్యాలు కల్పించడం మొదటి ప్రాధాన్యత అని ఆయన అన్నారు.

BRO ప్రాజెక్ట్ ను చేపట్టే ప్రాంతాల్లోనే కాకుండా మొత్తం దేశానికి భద్రత, శ్రేయస్సు కోసం వర్క్ చేస్తున్నందుకు రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. BROకేవలం నిర్మాణ సంస్థ మాత్రమే కాదని, ఐక్యత, క్రమశిక్షణ, విధి పట్ల అంకితభావం ఉన్న సంస్థ అని ఆయన అభివర్ణించారు. దేశ ప్రగతిలో రోడ్లు, వంతెనలు ఉ సొరంగాల ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన రక్షణ మంత్రి, BRO ద్వారా పూర్తి చేసిన ప్రాజెక్టులు సాయుధ దళాల కార్యాచరణ సంసిద్ధతను మెరుగుపరిచాయని, సుదూర ప్రాంతాలలో నివసించే ప్రజల సామాజిక-ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచాయని అన్నారు. సరిహద్దు ప్రాంతాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి అనేది ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఊహించిన విధంగా బలమైన, సురక్షితమైన.. స్వావలంబనతో కూడిన 'న్యూ ఇండియా' నిర్మాణానికి తిరుగులేని నిబద్ధతకు సూచికగా రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

సరిహద్దు ప్రాంతాలు కొత్త అభివృద్ధి కేంద్రాలుగా ఆవిర్భవించాయని, ఈశాన్య ప్రాంతాలు అభివృద్ధి చెందడమే కాకుండా దేశ సర్వతోముఖాభివృద్ధికి గేట్‌వేగా మారాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈశాన్య ప్రాంతం భారతదేశాన్ని దక్షిణానియా, ఆగ్నేయానియాతో కలుపుతున్నందున, అంతర్జాతీయ స్థాయిలో దేశం యొక్క పురోగతికి ఈ ప్రాంతాల అభివృద్ధి ముఖ్యమని ఆయన నొక్కి చెప్పారు. ఃఖీా తన 75 కేఫ్‌లు , టూరిజం పోర్టల్ ద్వారా సుదూర ప్రాంతాలలో పర్యాటకాన్ని ప్రోత్సహిస్తున్నందుకు కూడా ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమాలు నిరంతరంగా పెరుగుతున్న సంస్థ ఎదుగుదలకు ప్రతీక అని ఆయన అన్నారు.

అనేక కార్యక్రమాలను ప్రారంభించిన రాజ్నాథ్

భాస్కరాచార్య నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్పేస్ అప్లికేషన్స్ అండ్ జియో-ఇన్ఫర్మేటిక్స్ (ఃఖీాంఉ-ఔ) అభివృద్ధి చేసిన ఃఖీా రిసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ మరియు ఃఖీా బడ్జెట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అనే రెండు సాఫ్ట్ వేర్‌లను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. సాఫ్ట్ వేర్‌లు వనరుల పంపిణీ, వినియోగాన్ని అలాగే ఃఖీా బడ్జెట్‌ను ఆటోమేట్ చేయనున్నట్టు ఆయన స్పష్టం చేశారు.

పర్యావరణహిత జీవన విధానమే ఉత్తమం: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, మే 7:పర్యావరణహితమైన జీవన విధానమే ఉత్తమని గౌరవ భారత ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ఇలాంటి జీవన విధానాన్ని అవలంబించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నడుచుకోవటంతో పాటు ప్రభుత్వాలు కూడా ఇలాంటి విధానాలను కఠినంగా అమలుచేయడం తక్షణావసరమని ఆయన అన్నారు. ఏటా 1.5 డిగ్రీల మేర ఉష్ణోగ్రత పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ తరాలకు నివాసయోగ్యమైన భూమండలాన్ని అందించేందుకు ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలకు తోడుగా ప్రతి ఒక్కరూ మన చుట్టుపక్కనున్న పర్యావరణం పట్ల బాధ్యతాయుతమైన జీవన విధానంతో ముందుకెళ్లాలని ఆయన సూచించారు.

శనివారం చండీగఢ్‌లో 'ఎన్విరాన్మెంటల్ డైవర్సిటీ అండ్ ఎన్విరాన్మెంటల్ జురిస్ప్రుడెన్స్' అంతర్జాతీయ సదస్సును ఉపరాష్ట్రపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజు రోజుకూ అంతరించిపోతున్న జీవ వైవిధ్యాన్ని కాపాడుకనేందుకు కఠినమైన చర్యలు తీసుకోవడం అత్యంత ఆవశ్యకమన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ ఉద్యమాన్ని భారత్ ముందుడి నడిపిస్తోందన్న ఆయన.. గ్లాస్గోలో ఇటీవల జరిగిన సీవోపీ26 సదస్సులో ప్రధానమంత్రి ప్రసంగిస్తూ ఈ దిశగా భారత్ విధించుకున్న లక్ష్యాలను ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు.

భారత సంస్కృతి సంప్రదాయాల ప్రకారం ప్రకృతిని ఆరాధించడం, కాపాడుకోవడం ముఖ్యమైన ధర్మంగా పేర్కొన్న ఉపరాష్ట్రపతి, ఈ దిశగా భారత పార్లమెంటు ఎన్నో చట్టాలను ఆమోదించిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే ఈ చట్టాలను సమర్థవంతంగా, కఠినంగా అమలయ్యే దిశగా భారతదేశ న్యాయవ్యవస్థ పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకమైన బెంచ్ లను ఏర్పాటుచేయాల్సిన అవసరాన్నీ ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి ఉటంకించారు. కాలుష్య నిబంధనలను ఉల్లంఘించేవారిని, జీవ వైవిధ్యానికి సమస్యలు సృష్టిస్తున్న వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. అప్పుడే సమాజంలో పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరిలో బాధ్యత పెరుగుతోందన్నారు. బాల్యం నుంచే ఈ దిశగా విద్యార్థులను ముందుకు నడిపించేలా పాఠ్యప్రణాళికలోనూ మార్పులు చేయాలన్నారు.

దీనికితోడు స్థానిక సంస్థలు, కాలుష్య నియంత్రణ బోర్డులకు సాధికారత కల్పించడం ద్వారా ఈ దిశగా భారీ ముందడుగు వేసేందుకు వీలవుతుందని ఉపరాష్ట్రపతి అన్నారు. జల నిర్వహణ విషయంలో గ్రామ పంచాయతీలకు అధికారాలు కట్టబెట్టాలన్నారు.

ఈ కార్యక్రమంలో పంజాబ్ గవర్నర్ శ్రీ బన్వరీలాల్ పురోహిత్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవై, బ్రెజిల్ నేషనల్ హైకోర్టు జడ్జి జస్టిస్ ఆంటోనియో హెర్మన్ బెంజమిన్, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ మహ్మద్ రఫీక్, యూఎన్ రెసిడెంట్ కో-ఆర్డినేటర్ ఆఫ్ ఇండియా శ్రీ షోంబి షార్ప్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ స్వతంతర్ కుమార్, చండీగఢ్ విశ్వ విద్యాలయం కులపతి, శ్రీ సత్నామ్ సింగ్ సంధుతోపాటు విదేశీ ప్రతినిధులు, భారతదేశానికి చెందిన వివిధ రంగాల ప్రతినిధులు, పర్యావరణ వేత్తలు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధే ధ్యేయం..

-మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి
-23వ వార్డులో సీసీ రోడ్డు, డ్రైనేజీకి భూమి పూజ

రాజన్న సిరిసిల్ల, మే 7:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ మున్సిపల్ పరిధిలోని 23వ వార్డులో రూ.14 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాధవి మాట్లాడుతూ 23వ వార్డులోని పలు ప్రాంతాలలో రోడ్డు అధ్వానంగా ఉండడంవల్ల కాలనీ వాసులు, ఆస్పత్రికి వచ్చే ప్రజలు, వాహనదారులకు ఇబ్బంది అవుతుందని కాలనీవాసులు పాలకవర్గం దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించి నిధులు మంజూరు కాగానే రోడ్డు పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని గుర్తుచేశారు.

ఎమ్మెల్యే రమేష్ బాబు ప్రత్యేక చొరవతో వేములవాడ పట్టణానికి మంజూరైనటీయూఎఫ్ఐడీసియ నిధులు 14 లక్షలు కేటాయించడం జరిగిందని అన్నారు. వేములవాడ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని, పట్టణ అభివృద్ధే ధ్యేయంగా మున్సిపల్ పాలకవర్గం పనిచేస్తుందని తెలిపారు. వేములవాడ పట్టణ సమగ్రాభివృద్ధికి పాలకవర్గం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. పట్టణానికి కేటాయించిన 20 కోట్ల టీయూఎఫ్ఐడీసియ నిధులలో ఇప్పటివరకు 13 కోట్ల పనులకు టెండర్లు కూడా పూర్తయి, పనులు కూడా ప్రారంభమయ్యాయని, మిగతా వార్డులకు కూడా అత్యధిక నిధులు కేటాయిస్తూ పలు అభివృద్ధి పనులు చేస్తామని పేర్కొన్నారు. పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పట్ల కాంట్రాక్టర్ల అలసత్వం వల్లే పనులు తొందరగా ప్రారంభించ లేక పోతున్నామని, కాంట్రాక్టర్లు అలసత్వం వహించకుండా టెండర్లు పచ్చినవారు వెంటనే పనులు ప్రారంభించి, నాణ్యతతో పనులు పూర్తిచేయాలని సూచించారు. లేనిచో వారిపై అధికారులకు నివేదించి, వారి కాంట్రాక్టు ను రద్దు చేస్తామని హెచ్చరించారు. శానిటేషన్ పరంగా గాని, నీటి సమస్య పరంగా, వీధి దీపాల పరంగా ఏ సమస్య ఉన్నా కౌన్సిలర్ దృష్టికి గాని, పాలకవర్గం దృష్టికి గాని, మున్సిపల్ ఆఫీస్ ఫిర్యాదు బాక్స్ లో పిర్యాదు చేయాలన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యామ్ సుందర్ రావు, వైస్ చైర్మన్ మధు రాజేందర్, 27 వార్డ్ కౌన్సిలర్ గోలి మహేష్, మున్సిపల్ ఏఈ నరసింహ స్వామి, నాయకులు పైడి శ్రీనివాస్, వంగల శ్రీనివాస్, వార్డ్ కాలనీ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో కరాటే మాస్టర్ షిహాన్ కె.వసంత్‌కు గుర్తింపు

-సీ సైడ్ మార్షల్ ఆర్ట్స్ సంస్థ విద్యార్థులకు కరాటే శిక్షణ

రాజన్న సిరిసిల్ల, మే 7:(నేటినిజం ప్రతినిధి):ఒకినావ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ డిప్యూటీ గ్రాండ్ మాస్టర్, తెలంగాణ కరాటే అసోసియేషన్ స్టేట్ చైర్మన్ షిహాన్ కె.వసంత్ కుమార్ అమెరికాలో అరుదైన గుర్తింపు లభించింది.అమెరికాలోని డెలివరె స్టేట్ లో గల "సీ సైడ్ మార్షల్ ఆర్ట్స్ అకాడెమీ" కరాటే, సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్ కోసం ఆ సంస్థ స్వాగతం పలికగా, షిహాన్ కె.వసంత్ కువగార్ అమెరికాకు వెళ్లి వారం రోజుల పాటు సీ సైడ్ మార్షల్ ఆర్ట్స్ సంస్థ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఇందులో ఎఫెక్టివ్ సెల్ఫ్ డిఫెన్స్, కర్రసాము, కంబాట్ ఫైటింగ్, నాన్ చాక్ విభాగాల్లో శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా వసంత్ కుమార్ మాట్లాడుతూ అమెరికా లోని సీసైడ్ మార్షల్ ఆర్ట్స్ సంస్థలో శిక్షణ ఇవ్వడంతన విధి నిర్వహణకు ఆ మార్షల్ ఆర్ట్స్ సంస్థ ఇచ్చిన అరుదైన గౌరవమని అన్నారు. ఇది తన శిక్షణకు లభించిన ప్రత్యేక గుర్తింపు అని ఆయన అన్నారు. తన మార్షల్ ఆర్ట్స్ శిక్షణను అమెరికా లాంటి అగ్రరాజ్యంలో అందించడం చాలా సంతోషాన్ని, తృప్తిని కలిగిసుందని అన్నారు.ఈ విషయమై ఒకినావ మార్షల్ ఆర్ట్స్ అకాడెమీ ఇండియన్ గ్రాండ్ మాస్టర్ ఎస్.శ్రీనివాసన్ వసంత్ కుమార్ కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

అక్కడ మళ్లీ పెరుగుతున్న కరోనా.. 60శాతం ఒమిక్రాన్ సబ్ వేరియంట్ కేసులే..!

జోహెన్నెస్‌బర్గ్, మే 7:: దక్షిణాఫ్రికాలో కరోనా మళ్లీ ప్రభావం చూపుతున్నది. కేసులు మళ్లీ పెరుగుతుండడంతో అక్కడ పరిస్థితులపై అమెరికా ఆరోగ్యశాఖ అధికారులు నిశితంగా పరీక్షలిస్తున్నారు. కరోనా వేరియంట్ అయిన ఒమిక్రాన్ వేరియంట్ మొదట దక్షిణాఫ్రికాలోనే గుర్తించిన విషయం తెలిసిందే. రూపాంతం గుర్తించిన కొద్ది రోజుల్లోనే వేగంగా ప్రపంచవ్యాప్తంగా వ్యాపించింది. అగ్రరాజ్యం అమెరికాపై సైతం వేరియంట్ ప్రభావం చూపింది. గత డిసెంబర్‌లో దక్షిణాఫ్రికాలో ఒమిక్రాన్ కారణంగా ఇన్ఫెక్షన్ రేటు గరిష్ఠ స్థాయికి చేరుకున్నది. ఆ తర్వాత కాస్త తగ్గుతూ వచ్చింది. అయితే, మళ్లీ ప్రస్తుతం పాజిటివిటీ రేటు పెరుగుతున్నది. ఇదే సమయంలో వైరస్ కారణంగా ఆసుపత్రుల్లో చేరే కేసులు పెరుగుతున్నాయి. దక్షిణాఫ్రికా కొవిడ్-19 మహమ్మారి కారణంగా ఫిఫ్త్ వేవ్‌ను సంభవించే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరించారు.

అమెరికా నిపుణుల అభిప్రాయం ప్రకారం.. దక్షిణాఫ్రికాలో తాజాగా కేసులు పెరగడానికి ఒమిక్రాన్ సబ్ వేరియంట్లే కారణం. బీఏ.4, బీఏ.5 వేరియంట్లు ప్రభావం చూపుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. దక్షిణాఫ్రికాలో 60శాతం మంది ఈ రెండు వేరియంట్లతోనే బాధపడుతున్నారు. ఈ విషయాన్ని దక్షిణాఫ్రికాకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేబుల్ డిసీజెస్ తెలిపింది.

దక్షిణాఫ్రికా శాస్త్రవేత్తల ప్రకారం.. బీఏ4, బీఏ.5 వేరియంట్లు గతంలో వచ్చిన వేరియంట్ల కంటే ప్రభావం చూపుతున్నాయని, అయితే వ్యాక్సిన్లు తీసుకున్న వ్యక్తులు వైరస్ బారినపడే అవకాశాలు తక్కువగా ఉన్నట్లు తేలింది. ప్రపంచవ్యాప్తంగా రోగనిరోధక శక్తి పెరగడంతో వైరస్ తన స్వభావాన్ని మార్చుకుంటుందని దక్షిణాఫ్రికా సెంటర్ ఫర్ ఎపిడెమిక్ రెస్పాన్స్ ఇన్నోవేషన్ డైరెక్టర్ టులియో డి ఒలివేరా పేర్కొన్నారు. కొవిడ్-19 భిన్నంగా అభివృద్ధి చెందుతున్నట్లు కనిపిస్తోందని తెలిపారు. అమెరికా తూర్పు తీరంలో బీఏ.4, బీఏ.5, బీఏ2.12.1 సబ్ వేరియంట్ల కారణంగా కేసులు పెరిగాయని గమనించామని వైట్‌హౌస్ కరోనా వైరస్ టాస్క్‌ఫోర్స్ మాజీ కో-ఆర్డినేటర్ డెబోరా బిర్క్స్ పేర్కొన్నారు.

కరోనా మరో వేరియంట్‌ను ఎదుర్కొనేందుకు అమెరికా సిద్ధంగా ఉండాలన్నారు. ఇంతకు ముందు దక్షిణాఫ్రికాలో జరిగిందని, ఆ తర్వాత అమెరికాలోనూ ప్రభావం చూపిన నేపథ్యంలో ఈ సారి అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్త, పాత వేవ్‌ల మధ్య నాలుగు నుంచి ఆరు నెలలు తేడా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ సమయంలో ప్రజల సహజ రోగనిరోధక శక్తి తగ్గడం ప్రారంభమవుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు అమెరికాలో సన్నాహాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

యూఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ప్రకారం.. అమెరికాలో కరోనా సోకిన తర్వాత 60 శాతం మంది పెద్దలు, 75 శాతం మంది పిల్లల జనాభాలో యాంటీబాడీలు ఉంటాయి. ఈ యాంటీబాడీలు భవిష్యత్‌లో కరోనా ఇన్ఫెక్షన్ నుంచి ఎంత వరకు రక్షిస్తాయో అంచనా వేయడం కష్టం.

అన్నార్తుల సేవల్లో నిమగ్నమైన 'మై వేములవాడ ట్రస్ట్'

-అభాగ్యులు, యాచకులకు నిత్యం ఆహార పంపిణీ..

రాజన్న సిరిసిల్ల, మే 7:(నేటినిజం ప్రతినిధి): మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న నిత్యాన్నదాన సేవలు 358 రోజులకు చేరుకున్నాయి. శనివారం లక్ష్మీ గణపతి కాంప్లెక్స్ ముందు, ఆలయపరిసర ప్రాంతాల్లో ఉన్న యాచకులకు, అన్నర్థులకు మొత్తం 80 మందికి ట్రస్ట్ సభ్యులు అన్నదానం చేశారు. అన్నదాతలు నగుబోతు రవీందర్, రొక్కం నర్సింహారెడ్డి- వసంత, జువ్వాడి వెంకటేశ్వరరావు, అడ్వకేట్ దంపతులు, నాగుల రాజేశ్వర్-తేజస్విని కుటుంబ సభ్యులు అందించిన విరాళాలతో నిరంతరం ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన సేవలు కొనసాగిస్తామని అన్నారు. అన్నదానానికి విరాళాలు అందించిన, అందిస్తున్న దాతలందరికీ ట్రస్టు తరపున ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, నాగుల చంద్రశేఖర్, తాళ్లపెల్లి ప్రశాంత్,భస్మాంగి బస్వరాజు, చల్లా సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో పెరిగిన ఉష్ణోగ్రతలు.. హైదరాబాద్‌లో అత్యధికంగా 40 డిగ్రీలు

హైదరాబాద్, మే 7: తెలంగాణ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. మరోసారి ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయి. ఎండలు దంచికొట్టడం, ఉష్ణోగ్రతలు భారీ పెరగడంతో ఉక్కపోతకు గురవుతున్నారు ప్రజలు. శనివారం రోజు హైదరాబాద్‌లో అత్యధికంగా 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్ర వ్యాప్తం